ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
సోమవారం 1 సెప్టెంబరు 2025



దివ్యాంగులకు ఊరట

- యథావిధిగానే పింఛన్ల పంపిణీ
- రద్దు చేసిన 10,279 బాధితులకు తీపికబురు
- అప్పీలు చేసుకున్నా.. చేసుకోకున్నా కొనసాగింపు



దివ్యాంగుల పింఛన్‌దారుల్లో అనర్హుల ఏరివేతకు ప్రభుత్వం ప్రయత్నిం చగా అధికారుల నిర్లక్ష్యం అర్హుల పాలిట శాపంలా మారింది. గుంటూరు, బాపట్ల, పల్నా డు జిల్లాల పరిధిలో 10,279 మంది దివ్యాం గులను అనర్హులుగా అధికారులు గుర్తించా రు. దీంతో వీరికి సెప్టెంబరు నుంచి పింఛన్ రద్దు చేయాలని ప్రభు త్వం ఆదేశించిం ది. దీంతో తమకు పింఛన్ అందదని దివ్యాంగులు ఆందోళన లో ఉన్నారు. అయితే అనర్హుల కంటే అత్యధికంగా అర్హులు పింఛన్ల రద్దు అయిన జాబితాలో ఉన్నారని ప్రభుత్వం గుర్తిం చింది. దీంతో తమ అర్హతను నిరూపించుకునే అవ కాశం ఇవ్వడంతో పాటు యథావిధిగా పింఛన్లను పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించింది. దీంతో పింఛన్‌దారుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి.

గుంటూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్ల తొలగింపు విషయంలో ప్రభుత్వం ఒక అడుగు వెనక్కివేసింది. అనర్హతబారిన పడినవారికి తిరిగి అప్పీలు చేసుకునేందుకు గడువు ఉన్న నేపథ్యంలో సెప్టెంబరులో ఇచ్చే పింఛను పాత పద్ధతిలోనే ఇచ్చేందుకు సిద్ధమైంది. దీంతో అనర్హతబారిన పడిన దివ్యాంగులకు ఈ నెల ఊరట లభించింది. గత వైసీపీ ప్రభుత్వంలో దివ్యాం గుల పింఛన్ల జాబితాలో అనేకమంది అనర్హులు అక్రమంగా చొరబడ్డారు. వారిని వడపోయగా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 10,279 మంది అనర్హులని తేలింది. మరికొంత మంది వైకల్య శాతం తక్కువగా నమోదు కావడం తో వారిని రూ.15 వేల నుంచి 6 వేల పింఛను జాబితాలో వేసింది. మరికొందరు అనర్హులైన (మిగతా 6వ పేజీలో)

పాత జాబితా ప్రకారమే పంపిణీ




పాత జాబితా ప్రకారమే సెప్టెంబ రులో పింఛను అందజేస్తాం. పింఛన్లు రద్దయిన వారికి కూడా ఈ నెల పిం ఛన్లు ఇస్తున్నాం. అప్పీలు చేసుకునేం దుకు గడువు ఉండడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పాత జాబి తా ప్రకారం ఎంతయితే పింఛను వచ్చిందో.. ఈ నెల కూ డా అంతే పింఛను వస్తుంది. ఎవరూ ఆందోళన పడవద్దు.

- విజయలక్ష్మి, పీడీ, డీఆర్డీఏ గుంటూరు

పనికిరాని పనులు

తాగేందుకు పనికిరాని ప్రాంతాల్లో బోర్లు వేస్తున్నారు. పది కాలాలు పటిష్టంగా పైపులను భూగర్భంలో వేయాల్సి ఉండగా కనీస ప్రమా ణాలు పాటిం చడం లేదు.. ఇదీ రాజధాని అమ రావతిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో సీఆర్డీఏ అధికారుల నిర్వాకం.



- రాజధానిలో సీఆర్డీఏ ఇష్టారాజ్యం
- మౌలిక సదుపాయాల కల్పన అస్తవ్యస్తం
- క్లోరిన్ ఎక్కువగా ఉన్న చోట తాగునీటి బోర్లు
- పలుచోట్ల రస్టు, ఇసుక లేకుండా పైపులైన్ల ఏర్పాటు

29 గ్రామాల్లో రూ.904 కోట్లతో చేపడుతోన్న పనులు వృథా

గుంటూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం కేటాయించిన రూ.కోట్లు సీఆర్డీఏ అధికారుల నిర్వాకంతో వృఽథా అని రైతులు, ప్రజలు ఆరోపి స్తున్నారు. రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.904 కోట్లు కేటాయించింది. ఇందులో కోర్ క్యాపిటల్ పరిధిలోని గ్రామ కంఠాల్లో తాగునీటి సరఫరాలోని 30 శాతం గ్యాప్ భర్తీకి రూ.64.35 కోట్లు, మురుగునీటిని శుద్ధి చేసి బయట కు పంపడానికి రూ.110.72 కోట్లు, 40 శాతం మేర రహదా రుల గ్యాప్ భర్తీకి రూ.330.04 కోట్లు, వీధి దీపాల నిర్వహణ లో ఉన్న 10 శాతం గ్యాప్‌ను భర్తీకి రూ.12.25 కోట్లు, మిగి లిన మొత్తాన్ని ఇతర అవసరాల కోసం కేటాయించారు. అయితే ఈ సదు పాయాల కల్పన అస్తవ్యస్తంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికులను సంప్ర దించ కుండా, వారి అభిప్రా యాలను తీసుకో కుండా సీఆర్‌డీఏ అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

కఠిన జలాలున్న చోట బోర్లు

రాజధాని గ్రామాలకు తాగునీటి వసతి కల్పించడానికి రూ.64.5 కోట్లతో బోర్లు, పైపులైన్లు వేస్తున్నారు. ప్రజలకు సురక్షితమైన నీరు లభ్యమయ్యే చోట బోర్లు వేయాలి. అయితే సీఆర్డీఏ అధికారులు కఠిన జలాలు ఉండే ప్రాంతాల్లో బోర్లు వేస్తున్నారు. వెలగపూడి గ్రామానికి నీటి సరఫరా కోసం ఎన్ 10 రోడ్డుకు సమీపంలో బోరు వేసి సీడ్ యాక్సిస్ రోడ్డు మీదగా ఎన్ 9 రోడ్డు వరకూ తెచ్చి అక్కడి నుంచి ఎన్ 9 రోడ్డుకు సమాంతరంగా పైపు లైను వేస్తున్నారు. అయితే అక్కడ కఠిన జలాలు, ఫ్లోరిన్, క్లోరిన్, సున్నం అధికంగా ఉందని స్థానికులు చెబుతు న్నారు. కానీ ఎన్ 9 రోడ్డుకు (మిగతా 6వ పేజీలో)

● ప్రమాణాలు పాటించకుండా పైపులైన్లు

తాగునీటి పైపులైను వేసే సమయంలో నిర్దిష్ట ప్రమాణాలు పాటించాలి. భూకం పాలు, విపత్తులను తట్టుకునేలా భూమి లోపల వేయాలి. పైపులను వేయడానికి ముందే కిందిభాగంలో ఇసుక లేదంటే గ్రావెల్ రస్టు వేసి చదును చేయాలి. పైపులు వేశాక కూడా అన్నివైపులా ఇసుక/రస్టుతో కప్పి, మట్టి వేయాలి. కానీ చాలా చోట్ల అధి కారులు ఆ ప్రమాణాలు పాటించలేదని స్థాని కులు చెబుతున్నారు. వెలగపూడి, మల్కా పురం గ్రామాలకు నీటి సరఫరా చేసే పైపు లైన్లలో ప్రమాణాలు పాటించలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ఈపీటీఎస్‌లో గుంటూరు ఏడో స్థానం

- వెనకబడిన పల్నాడు, బాపట్ల జిల్లాలు
- ప్రతీ వారం సమీక్షించాలని కలెక్టర్లకు ఆదేశాలు

గుంటూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ పెర్‌ఫార్మెన్స్ ట్రాకింగ్ సిస్టమ్ (ఈపీటీఎస్)లో రాష్ట్రంలో గుంటూరు జిల్లా ఏడో స్థానంలో నిలిచింది. పల్నాడు జిల్లా 20, బాపట్ల జిల్లా 21వ స్థానంలో ఉన్నాయి. ఈపీ టీఎస్ విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని వెనుకబడిన జిల్లాల అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. జీవోలు మొదలు అన్ని రకాల డాక్యుమెంట్ల ను సాధ్యమై నంత త్వరగా ఈపీటీఎస్‌లో అప్‌లోడింగ్ చేయాలని ఆదే శించింది. గుడ్ గవర్నెన్స్‌కు ఈపీటీఎస్ ఎంత గానో ఉపయోగపడుతుందని, అధికారులు పటి ష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించింది. గుం టూరు జిల్లాలో ఇప్పటివరకు 39,349 డాక్యు మెంట్లను అధికా రులు ఈపీటీఎస్‌లో అప్ లోడింగ్ చేశారు. వాటిల్లో జీవోలు 1369, మె మోలు 800, సర్క్యులర్లు 1291, నోటి ఫికేషన్లు 125, లేఖలు 14975, చట్టాలు, నిబంధనలు, క్రమబద్ధీకరణలు 247, విధానపరమైన పత్రాలు 555, తీర్మానాలు 73, ఆడిట్ రిపోర్టు లు 281, తీర్పులు 181, ప్రొసీడింగ్స్ 15838, ఇతరత్రా 3614 ఉన్నాయి. అదే పల్నాడు జిల్లా కు వచ్చేసరికి అన్ని కలి పి కూడా కేవలం 8598 డాక్యుమెంట్లు మాత్రమే అప్ లోడింగ్ చేశారు. బాపట్ల జిల్లాలో మరీ తక్కువగా 5248 డాక్యుమెంట్స్‌ని ఈపీటీఎస్‌లో నిక్షిప్తం చేశారు. దీని వల్ల ఆయా జిల్లాల ఉద్యోగులు గుడ్ గవర్నెన్స్‌లో వెనకబడిపోయే అవకాశం ఉన్నదంటూ కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.



ప్రధాన పైప్‌లైన్‌కు జరుగుతున్న మరమ్మతులు

పైప్‌లైన్లకు మరమ్మతులు

నేడు, రేపు నీటి సరఫరాకు అంతరాయం

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నగరంలో పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి ప్రధాన పైప్‌లైన్‌పై ఏర్పడిన లీకులకు ముమ్మరంగా మరమ్మతులు జరుగుతున్నాయి. ఇప్పటికే సంజీవ య్యనగర్ రైల్వేగేట్ వద్ద, నెహ్రూనగర్ రిజర్వా యర్ వద్ద పైపులైన్లకు ఇంటర్ కనెక్షన్ల పనులు చేపట్టారు. హెచ్‌ఎల్‌ఆర్, రామనామ క్షేత్రం, అంబేద్కర్‌నగర్ తదితర ప్రాంతాల్లో కూడా లీకులకు మరమ్మతులు చేస్తున్నా రు. ఆయా పనులను కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం పరిశీలించారు. పైపులైన్ల మరమ్మతు పనులు శరవే గంగా పూర్తి చేయాలని ఆదేశిం చారు. నిర్ణీత గడువు కంటే ముం దుగానే పనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీరు అందించాలని కమిషనర్ సూ చించారు. మరమ్మతుల నేపథ్యంలో సోమవారం, మంగళవారం కూడా నగరం లోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. మంగళవారం సాయంత్రానికి పనులు పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

అన్నిరంగాల్లోనూ.. స్మార్ట్

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- మనోహర్‌తో కలిసి తెనాలిలో రేషన్ కార్డుల పంపిణీ

దేశంలోకెల్లా ఏపీలో అత్యధిక సంక్షేమం

తెనాలి అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం అ న్ని రంగాల్లో స్మార్ట్ కాబోతుందని కేంద్ర సహాయ మం త్రి పెమ్మసాని చం ద్రశేఖర్ తెలిపారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహ ర్, ఎమ్మెల్సీ ఆలపాటి రా జేంద్రప్రసాద్‌తో కలిసి తెనా లిలో పెమ్మసాని స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చు ట్టారు. పట్టణంలోని పినపాడు, రూరల్ మండలంలోని కఠెవరం, నందివెలుగు గ్రామాల్లో స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసు కుని ప్రజలకు మేలు కలిగేలా మంత్రి మనోహర్ పౌరస రఫరాల శాఖను తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. దేశంలో అత్యధిక సంక్షేమ పథకాలను అందిస్తున్నది మన రాష్ట్రమేనని చెప్పారు. రూ.కోట్లు భారం ప డుతున్నా ఎలాంటి లోటు రానివ్వకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. ఐదేళ్ల పాటు అధ్వాన రోడ్లపై అగచాట్లు పడిన ప్రజలు ప్రస్తుతం సుఖంగా ప్రయాణం చేస్తున్నారని తెలిపారు. మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రాని కి కంపెనీలు, పరిశ్రమలు తరలి వస్తున్నాయని, యువతకు వేలాది ఉద్యోగాలు లభిస్తాయన్నారు. మంత్రి మనోహర్ మాట్లాడు తూ గత ప్రభుత్వం వ్యవస్థల ను నిర్వీర్యం చేసిందని, కూట మి ప్రభుత్వం చక్కదిద్దడమే ధ్యేయంగా ముందుకు వెళ్త ున్నారు. ఆర్థిక ఇబ్బందు లు పక్కనపెట్టి సూపర్ సిక్స్ అమలు చేస్తుంద న్నారు. నెలలో అన్ని రోజులు రేషన్ షాపు లు అందుబాటులో ఉంచుతామన్నారు. వైసీపీ నేతలు చే స్తున్న దుష్ప్రచారాల్ని నమ్మవద్దని కోరారు. ఎమ్మెల్సీ ఆలపాటి మాట్లాడుతూ నిజాయితీ లేని గత ప్రభు త్వం రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసికూటమి పాలన పై దుమ్మెత్తి పోస్తుందని విమర్శించారు. సబ్ కలె క్టర్ సంజనాసింహ, తహసీల్దార్ కేవీ గోపాల కృష్ణ, కూటమి నాయకులు, కా ర్యకర్తలు పాల్గొన్నా రు.



స్మార్ట్ రేషన్‌కార్డులు అందజేస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు పెమ్మసాని, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా

సైక్లింగ్‌తో శారీరక దృఢత్వం

- ఫిట్ ఇండియా ర్యాలీలో ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక జీవన శైలిలో సైక్లింగ్‌తో శారీరక దృఢత్వం కలుగుతుందని ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఫిట్ ఇండియా సన్ డేస్ ఆన్ సైకిల్ ర్యాలీ విత్ డిస్ట్రిక్ట్ పోలీస్ ఫోర్సెస్ కార్యక్రమం జరిగింది. ఏఎస్పీ ఏ.హనుమంతుతో కలిసి ఎస్పీ సైకిల్ ర్యాలీని పోలీస్ కార్యాలయం వద్ద ప్రారంభించారు. ర్యాలీలో పోలీస్ అధికారులు, సిబ్బంది సైకిళ్లపై ఎంటీటీ సెంటర్ వరకు వెళ్లి తిరిగి పోలీస్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మా ట్లాడుతూ పోలీస్ సిబ్బందిలో శారీరక దృఢత్వం, విధుల్లో చురుకుదనం, మానసిక ఉల్లాసం పెంపొందించడమే సైకిల్ ర్యాలీ ముఖ్య ఉద్దేశమన్నారు. ఆరోగ్యకర జీవన విధానం ద్వారా ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించవచ్చన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే పోలీస్ దళం ఆరోగ్యంగా, దృఢంగా ఉండటం అత్యంత అవసరమన్నారు. క్రమంతప్పకుండా వ్యాయామం, క్రీడలు, సైక్లింగ్ వంటి ఆరోగ్యకర కార్యకలాపాలను సిబ్బంది అలవర్చుకోవాలని సూచించారు. ర్యాలీలో ఏఎస్పీ రమణమూర్తి, డీఎస్పీలు అరవింద్, శివాజీరాజు, ఏడుకొండలరెడ్డి, ఎస్‌బీ సీఐ అళహరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి సైకిల్ తొక్కుతున్న ఎస్పీ సతీష్‌కుమార్



మంగళగిరి : సీతానగరం వద్ద గణేష్ నిమజ్జనం



గుంటూరులో గణనాథుల ఊరేగింపు



కొమ్మమూరు కాలువ వద్ద నిమజ్జనం కోసం తరలివచ్చిన గణనాథులు







కోలాహలంగా.. నిమజ్జనోత్సవాలు

జై బోలో గణేష్ మహరాజ్.. గణపతిబప్పా మోరియా.. అంటూ ఆదివారం గణనాథుల నిమజ్జనోత్సవాలు కోలాహలంగా జరిగాయి. వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన మండపాల్లో ఐదు రోజులుగా పూజలు అందుకున్న గణప తుల ను భక్తులు భక్తిశ్రద్ధల మధ్య గంగమ్మఒడికి చేర్చారు. ఆది వారం పెద్దఎత్తున పూజ లు నిర్వహిం చారు. అనంతరం అన్న దానాలు చేశారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు జయ జయ ధ్వానాల మధ్య గణనాథు లను ప్రత్యేక వాహనాల్లో గ్రామోత్సవం నిర్వహించారు. యువత, చిన్నారులు టపాకా యలు కాలుస్తూ, రంగులు చల్లుకుంటూ, డప్పు వాయిద్యాల మధ్య నృత్యాలు చేస్తూ సందడి చేస్తూ విఘ్నేశ్వరుడ్ని సాగనంపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షించారు.



● అమరావతి వద్ద నిమజ్జనానికి బారులు తీరిన గణనాథులు



ఎక్స్‌కవేటర్‌తో గణనాథుడిని పడవలోకి ఎక్కిస్తూ..

రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీలలో
వైజాగ్ క్రీడాకారుల సత్తా
● పురుషుల, మహిళల విభాగంలో ప్రథమ బహుమతులు

సాగర్‌కు కొనసాగుతున్న
వరద ఉధృతి
● 26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

6

నాగార్జున కొండపై
పర్యాటకుల సందడి

రాష్ట్ర స్థాయి క్యారమ్స్‌లో వైజాగ్ క్రీడాకారుల సత్తా

● పురుషుల, మహిళల విభాగంలో ప్రథమ బహుమతులు

చిలకలూరిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక సిఆర్ క్లబ్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీలలో వైజాగ్ క్రీడాకారులు సత్తా చాటారు. పురుషులకు, మహిళలకు వేరు వేరుగా నాకౌట్ పద్ధతిలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో పురుషుల, మహిళల విభాగాల్లో విశాఖపట్టణానికే చెందిన సిహెచ్. జనార్ధన్‌రెడ్డి, ఎ. భవాని ప్రథమ బహుమతులు అందుకున్నారు. పురుషుల విభాగంలో ఎన్ వెంకయ్య (నెల్లూరు) ద్వితీయ బహుమతి పొందగా, జి. జయకుమార్ (గుంటూరు) తృతీయ, బి. పవనకుమార్ (అనంతపురం) నాలుగో బహుమతిని అందుకున్నారు.



పురుషుల విభాగంలో ప్రథమ బహుమతి అందుకుంటున్న సీహెచ్ జనార్ధనరెడ్డి (వైజాగ్)

మహిళల విభాగంలో ఎల్ హరిప్రియ (విశాఖపట్నం) ద్వితీయ, డాక్టర్ ఎంఎస్‌కే హారిక (విశాఖపట్నం) తృతీయ, ఎస్‌కే హుస్నా సమీరా (విశాఖపట్నం) నాలుగో బహుమతిని అందుకున్నారు. ఆదివారం ముగింపు సభలో విజేతలకు సీఆర్ క్లబ్ ఉపాధ్యక్షుడు చెరుకూరి కాంతయ్య, కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు, కోశాధికారి మక్కెన నరసింహారావు బహుమతి ప్రదానం చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన 170 మంది క్రీడాకారులు పోటీలలో పాల్గొన్నారు. రాష్ట్ర క్యారమ్ సంఘం ప్రధానకార్యదర్శి షేక్ అబ్దుక్ జలీల్, టోర్నమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్ వి రమణమూర్తి, అబ్జర్వర్ గద్దె వేణు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మాల్దీవులు వెళ్ళడానికి రూ.లక్ష ఆర్థిక సహాయం

రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలలో ప్రథమ స్థానంలో గెలుపొందిన జనార్ధన్ రెడ్డికి క్యారమ్ ప్రపంచ కప్ పోటీలలో పాల్గొనేందుకు మాల్దీవులు వెళ్ళడానికి రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని సీఆర్ క్లబ్ తరపున క్లబ్ కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు అందచేశారు.

దివ్యాంగులకు ఊరట

(5వ పేజీ తరువాయి)

వయోవృద్ధులను సాధారణ పింఛను జాబితాలో వేసింది. అయితే ఈ జాబితాలో అనర్హులతోపాటు కొందరు అర్హులు కూడా పింఛను కోల్పోయారు. ఈ నేపథ్యంలో దివ్యాంగుల్లో కలవరం మొదలైంది. అధికారుల వద్దకు పరుగులు పెట్టారు. దీంతో ప్రభుత్వం వారికి తిరిగి అప్పీలు చేసుకునే అవకాశం కల్పించింది. వారి వైకల్య స్థాయిని పునః పరిశీలించేందుకు మరోమారు అప్పీలు చేసుకునే సదుపాయం కల్పించింది. దీంతో పెద్దసంఖ్యలో అభ్యర్థనలు వచ్చాయి. అప్పీలు చేసుకునేందుకు గడువు కూడా ఉండడంతో పాత పద్ధతిలోనే పింఛను ఇచ్చేందుకు నిర్ణయించింది. బాధితులు అప్పీలు చేసుకున్నా, చేసుకోకున్నా వారికి యథావిధిగా పింఛన్లను కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పింఛన్లు తొలగిస్తూ విడుదల చేసిన కొత్త జాబితాపై ఆందోళనలు వెల్లువెత్తడంతో పాత జాబితా మేరకే పింఛన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు పాత జాబితాను తిరిగి విడుదల చేయడంతోపాటు, ఆ జాబితాకు అను గుణంగా నగదును బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. గతంలో మాదిరిగానే లబ్ధిదారులు రూ.15 వేలు, రూ.6వేలు చొప్పున పింఛన్లు అందుకోనున్నారు. ఇస్తున్నారు. తాజాగా పేర్లు తొలగించిన 10,279 మందికి కూడా అదే పద్ధతిలో పింఛన్లు అందించాలని ఆయా జిల్లా అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

సాగర్‌కు కొనసాగుతున్న వరద ఉధృతి


ప్రాజెక్టు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండడంతో ఆదివారం ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. సాగర్ జలాశయం నీటిమట్టం 586.70 అడుగులు ఉంది. ఇది 303.94 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,019 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఎడమ కాలువ ద్వారా 5,156 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,130 క్యూసెక్కులన విడుదల చేస్తుండగా 22 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు, 4 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,56,746 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు మొత్తంగా 3,05,551 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లోగా 3,41,558 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పశ్చిమడెల్టాకు 6500 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకు 6500 క్యూసెక్కునీరు ఆదివారం విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 2,33,975 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 216 క్యూసెక్కులు, రేపల్లె కాల్వకు 1486 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 452 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 208 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 413 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 2380 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

టెయిల్‌పాండ్ నుంచి 2,32,037 క్యూసెక్కుల నీటి విడుదల


రెంటచింతల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణా నదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ ప్రాజెక్టు నుంచి పులిచింత లకు 2,32,037 క్యూసెక్కుల నీటి విడుదల చేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు. ప్రాజెక్టు 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 9 గేట్లను 3 మీటర్ల మేర, 8 గేట్లను 2.5 మీటర్ల మేర ఎత్తి నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. ఎగువన వున్న సాగర్ నుంచి 2,35,057 నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరుతోందని, ప్రస్తుతం రిజర్వాయర్‌లో 74.60 మీటర్ల మేర నీరుండగా ఇది 6.625 టీఎంసీలకు సమానమని తెలిపారు. విద్యుదుత్పత్తిని నిలిపి వేసినట్లు వారు చెప్పారు.


టెయిల్‌పాండ్ నుంచి 17 క్రస్ట్ గేట్ల స్పిల్‌వే ద్వారా జాలువారుతున్న కృష్ణమ్మ

ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు వరద నీరు

2,10,700 క్యూసెక్కులు విడుదల

తాడేపల్లి టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేయడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతో పాటు కీసర, మున్నేరు, వెలగలేరు, తదితర ప్రధాన వాగుల నుంచి ఆదివారం 2లక్షల 25 వేల 641 క్యూసెక్కుల వరదనీరు ఇన్‌ఫ్లోగా నమోదయినట్లు ఇరిగేషన్‌శాఖ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుం డగా దిగువకు 2 లక్షల 10 వేల 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. అలాగే తూర్పు డెల్టా కాలువకు 8 వేల 419 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 6 వేల 522 క్యూసెక్కులు వదులుతున్నామని, గుంటూరు ఛానల్‌కు నీటి విడుదలను నిలిపివేశామని జేఈ రాజేశ్ తెలిపారు.


ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు విడుదలవుతున్న కృష్ణానది వరదనీరు

మహిళా సభల విజయవంతంలో యరపతినేని భేష్

● నాడు పసుపు కుంకుమ, సీమంతాలతో శ్రీకారం ● నేడు స్త్రీ శక్తి మహాసభ



పిడుగురాళ్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గంలో మహిళామణులకు పెద్దపీట వేయటంలో యరపతినేని శ్రీనివాసరావు ఎప్పుడూ ముందుంటారు. మహిళలకు అన్నింటా ప్రాధాన్యం కల్పిస్తూ వారికి సముచిత స్థానం కల్పిస్తుంటారు. పార్టీ, తాను అధికారంలో ఉన్నా లేకున్నా మహిళలకు ఏ చిన్న ఆపద వచ్చినా వారిని తమ కుటుంబసభ్యులుగా భావించి నేనున్నానంటూ ఆదుకుంటారు. నియోజకవర్గంలోని మహిళలను తోబుట్టువులుగా తలచి 2014-19 మధ్యకాలంలో పసుపు కుంకుమ, సీమంతం, షష్ఠిపూర్తి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గురజాల నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు 30 వేల మంది మహిళలకు పసుపు కుంకుమ, 7 వేల మందికి షష్ఠిపూర్తి, మరో 7 వేల మందికి సీమంతం కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే తంగెడలోని 2 వేల మంది ముస్లిం మైనారిటీ అక్కాచెల్లెళ్లకు పసుపు కుంకుమ, సీమంతం కార్యక్రమంతో పాటు దళిత తేజంతో దళిత కాలనీలకు వెళ్లి నూతన వస్త్రాలను అందజేసి వేలాది మంది మనసుల్లో ఓ అన్నగా స్థానం సంపాదించుకున్నారు. ఆనాడు చేపట్టిన పసుపు కుంకుమ, సీమంతం, షష్ఠిపూర్తి కార్యక్రమాల వల్లే 2024 ఎన్నికలలో ఆయనకు అత్యధిక మెజారిటీ దక్కింది.

నేడు మహిళా మణులతో భారీ బహిరంగసభ

ఆనాడు వేలాది మందికి ఓ అన్నగా తోడుంటూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు పెద్దదిక్కుగా మారిన ఎమ్మెల్యే యరపతినేని నేడు పిడుగురాళ్లలో 30 వేల మంది మహిళామణులతో స్త్రీ శక్తి పథకం విజయోత్సవ సభను జరపనున్నారు. పల్నాడు ప్రాంతంలో ఇప్పటి వరకు జరిగిన సభలకు భిన్నంగా అత్యధికంగా వేలాది సంఖ్యలో ప్రత్యేకంగా మహిళలతోనే ఈ సభ జరగనుంది. సభను విజయవంతం చేసేందుకు నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని పట్టణ, గ్రామాల నుంచి వేలాది సంఖ్యలో మహిళా మణులు ఈ సభకు తరలిరానున్నారు.

నాడు యరపతినేని పథకాలపై పార్టీలో చర్చ

2014-19 మధ్యకాలంలో ఎమ్మెల్యే యరపతినేని గురజాల నియోజకవర్గంలో మహిళల కోసం ప్రత్యేకంగా చేపట్టిన పసుపు కుంకుమ కార్యక్రమాలపై ఆనాడు టీడీపీ రాష్ట్ర పార్టీలో చర్చ జరిగింది. పసుపు కుంకుమ పథకం గురించి మీడియా ద్వారా, స్వయంగా సభకు హాజరైన నేతల ద్వారా తెలుసుకున్న చంద్రబాబు తర్వాత ప్రభుత్వ పథకంగా దాన్ని ప్రవేశపెట్టి మహిళలకు ఆర్థికంగా చేయూతనిచ్చారు.

ఎద్దుల బండలాగుడు పోటీలకు ప్రభుత్వం చేయూత

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


ప్రథమ స్థానంలో నిలిచిన పల్నాడు జిల్లా ఎద్దులు

ప్రత్తిపాడు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎద్దుల బండలాగుడు పోటీలకు ప్రభుత్వం చేయూత అవసరమని, ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి దృష్టికి తీసుకెళతానని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ప్రత్తిపాడులో మూడో రోజు జరుగుతున్న నందమూరి తారాకరామారావు మెమోరియల్ ఒంగోలు జాతి ఎద్దుల బండలాగుడు పోటీలను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా పోటీలలో తలపడుతున్న పశుపోషకులకు మెమోంటోలు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఎద్దుల బండలాగుడు పోటీలను రాష్ట్రంలో తిరిగి ప్రారంభించిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం పశుపోషణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. ఎద్దులను మేపడం ఎంతో ఖర్చుతో కూడుకున్న పని అని, అయినా రైతులు వ్యయప్రయాసలతో వాటిని మేపుతున్నారని కొని యాడారు. అలాంటి రైతులకు ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. జగన్ వెళుతూ ఖాళీ డబ్బాను ఇచ్చి వెళ్లాడని త్వరలోనే ప్రభుత్వం ద్వారా ఇలాంటి పందేల నిర్వహణకు చేయూత అందించే విధంగా ప్రయత్నం చేస్తామని ప్రత్తిపాటి పుల్లారావు హామీ ఇచ్చారు. రాష్ట్ర తెలుగు రైతు మీడియా కో-ఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట మార్కెట్ యార్డు చైర్మన్ కరిముల్లా, నెల్లూరు సదాశివరావు, జవ్వాజి మదన్‌మోహన్, కుర్రి సుబ్బారెడ్డి, కాకాని సురేష్, పమిడి శ్రీనివాసరావు, మాకినేని జగన్, నువ్వుల సునీల్ చౌదరి, మామిళ్లపల్లి రామ్ గోపాల్, నక్కల అగస్టియన్, నల్లమోతు పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఆరుపళ్ల విభాగంలో సత్తాచాటిన పల్నాడు జిల్లా ఎద్దులు

ఆరుపళ్ల విభాగంలో జరిగిన పోటీలలో పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం, కేశానపల్లి గ్రామానికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎద్దుల జత 3,717 అడుగుల దూరం బండను లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే నంద్యాల జిల్లా పాణ్యం మండలం, కొత్తూరుకు చెందిన బీఆర్‌కే రెడ్డి, గుంటూరు జిల్లా మంగళగిరి మండలం, నవులూరుకు చెందిన బత్తుల శ్రీనివాసరావుకు చెందిన ఎద్దుల జత 3,600 అడుగుల దూరం బండను లాగి ద్వితీయ స్థానంలో, బాపట్ల జిల్లా జే పంగులూరుకు చెందిన గొట్టిపాటి రవి కుమార్ యాత్, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లి గ్రామానికి చెందిన కావ్యానంది బ్రీడింగ్‌బుల్స్ సెంటర్‌కు చెందిన ఎద్దుల జత 3,309 అడుగుల దూరం లాగి మూడవ స్థానంలో నిలిచింది. కృష్ణా జిల్లా పెనుమలూరు మండలం యనమలకుదురుకు చెందిన అనంతనేని శ్రీ కావ్య శ్రీమధు ఎద్దుల జత 3,300 అడుగుల దూరం బండను లాగి నాలుగో స్థానంలో, నంద్యాల జిల్లా ఎస్ కొత్తూరుకు చెందిన బీఆర్‌కే రెడ్డి, కేదార్ శర్వానందరెడ్డిలకు చెందిన ఎద్దుల జత 3,243.6 అడుగుల దూరం బండను లాగి ఐదవ స్థానంలో, బాపట్ల జిల్లా యద్దనపూడికి చెందిన ఎంకేఎం ఎద్దుల జత 3,058.2 అడుగుల దూరం బండను లాగి ఆరో స్థానంలో, ఎన్‌టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం తుర్లపాడుకు చెందిన దర్శి సాత్విక్, జశ్వంత్ సింహాకు చెందిన ఎద్దుల జత 2,712.10 అడుగుల దూరం బండను లాగి ఏడో స్థానంలో, గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నవులూరుకు చెందిన బత్తుల శ్రీనివాసరావుకు చెందిన ఎద్దుల జత 2,556 అడుగుల దూరం బండను లాగి 8వ స్థానంలో నిలిచాయి. గెలిచిన ఎద్దుల యజమానులకు కమిటీ సభ్యులు నగదు బహుమతులను అందజేశారు.

ఇద్దరు యువకులు గల్లంతు

● రక్షించిన మెరైన్, పోలీసు సిబ్బంది


సముద్రంలో గల్లంతయిన వారిని బయటకు తీసుకొస్తున్న మెరైన్ సిబ్బంది, గజఈతగాళ్ళు

బాపట్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సూర్యలంక సముద్రతీరంలో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యువకులు అలల తాకిడికి గల్లంతయ్యారు. సముద్రంలో కొట్టుకుపోతున్న వారిని మెరైన్ సిబ్బంది, రూరల్ పోలీసులు, గజఈతగాళ్ళు సమయస్ఫూర్తితో వ్యవహరించి రక్షించారు. మెరైన్ సీఐ టి.లక్ష్మారెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న షేక్.సమీర్, షేక్.అదిల్ స్నేహితులతో కలిసి ఆదివారం సూర్యలంక సముద్రతీరానికి వచ్చారు. సముద్రస్నానం చేస్తుండగా అలల ధాటికి లోతుకు వెళ్ళిపోయి ప్రమాదంలో చిక్కుకున్నారు. గమనించిన సూర్యలంక కోస్టల్ సెక్యూరిటీ, పోలీసు సిబ్బంది కె.వెంకటేశ్వర్లు, ఎం.పోతురాజు, రూరల్ పోలీసు విక్టర్ గజతతగాళ్ళతో వెళ్ళి వెంటనే వారిని బయటకు తీసుకొచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం బాపట్ల ఏరియావైద్యశాలకు పంపామని లక్ష్మారెడ్డి తెలిపారు. సిబ్బంది సకాలంలో స్పందించటం వల్లే ఇద్దరు యువకులు ప్రాణాలతో బటయపడ్డారని ఆయన పేర్కొన్నారు.

పని కోసం వెళ్ళి ప్రాణాలు కోల్పోయాడు

● బాపట్లకు చేరిన తమిళనాడులో ఏనుగుల దాడికి గురైన యువకుడి మృతదేహం


పేర్లి సుకుందరావు (ఫైల్‌ఫొటో)

బాపట్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఏనుగుల దాడిలో మృతిచెందిన యువకుడి మృతదేహం ఆదివారం బాపట్లకు చేరుకుంది. పనికోసం పరాయి రాష్ట్రం వెళ్లిన యువకుడు అక్కడ ఏనుగుల దాడిలో మృతి చెందడంతో పట్టణంలో విషాద ఛాయలు అలుము కున్నాయి. పట్టణంలోని జగన్నాధపురానికి చెందిన పేర్లి సుకుందరావు వరఫ్ బుజ్జి (35) తమిళనాడు రాష్ట్రం బంజూరులోని కొండప్రాంతంలోగల ప్లజంట్ వ్యాలి ఎస్టేట్‌లో మేనేజర్‌గా పనిచేసేందుకు వెళ్ళాడు. అక్కడ పండించే పంటలను చూసుకుంటూ రిసార్ట్‌లో ఉండేవాడు. శుక్రవారం ఏనుగులు రావటంతో వాటి నుంచి తనను తాను కాపాడుకునే ప్రయత్నంలో జారిపడ్డాడు. ఓ ఏనుగు అతడిపై దాడి చేయడంతో అక్కడికక్కడే బుజ్జి మృతి చెందాడు. ఫారెస్ట్ అధికారులు, పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి శనివారం కుటుంబసభ్యులకు అప్పగించారు. ఆదివారం భౌతికకాయాన్ని బాపట్లకు తీసుకొచ్చారు. మృతుడికి వివాహం కాలేదు. కాగా, జీవనోపాధి కోసం వెళ్ళి జీవితాన్నే కోల్పోయాడంటూ తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్థులు బుజ్జి భౌతికకాయం వద్ద బోరున విలపించారు.

నాగార్జున కొండపై పర్యాటకుల సందడి

● లాంచీ స్టేషన్ ఆదాయం రూ. 1,27,450

విజయపురిసౌత్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండపై పర్యాటకుల సందడి నెలకొంది. ప్రాజెక్టు 26 గేట్ల ద్వారా నీరు విడుదల కావడం అలాగే ఆదివారం కావడంతో కొండపైకి పర్యాటకులు పోటెత్తారు. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు శాంతిసిరి, నాగసిరి, అగస్త్యా లాంచీలలో చేరుకుని కొండపై గల మ్యూజియంలోని బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టికుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహాన్ని సందర్శించారు. అనంతరం అనుపులోని అశ్వమేధ యజ్ఞశాల, శ్రీచేత్యము, యాంపి థియేటర్, శ్రీరంగనాథస్వామి ఆలయాన్ని వీక్షించారు. అనంతరం 60 అడుగులు ఎత్తు నుంచి జాలువారుతున్న ఎత్తిపోతల జలపాతం అందాలను తిలకించి మైమరచిపోయారు. లాంచీల ద్వారా రూ. 1,27,450 ఆదాయం పర్యాటక శాఖకు సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

మహిళా సాధికారతే సీఎం చంద్రబాబు లక్ష్యం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీలు, మహిళా సాధికారతే సీఎం చంద్రబాబునాయుడి లక్ష్యాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలు అమలు చేసి ధైర్యంగా ప్రజల్లోకి వస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఏ మహిళను కదిలించినా సంతోషం కనిపిస్తుందని, ఉచిత బస్సు ప్రయాణంపై వారు చాలా ఆనందంగా ఉన్నారని అన్నారు. మహిళల విద్యాభివృద్ధికి 2004లోనే సైకిళ్ళు పంపిణీ చేసిన ఘనత చంద్రబాబుదని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంలో ఆయన చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. తల్లికి వందనం ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి రూ. 15వేలు ఇస్తూ బాలికల విద్యకు ప్రభుత్వం అండగా నిలిచిందని, ఎన్టీఆర్ భరోసాను ఒకేసారి రూ. వెయ్యి పెంచి రూ. 4 వేలు పెన్షన్ ఇస్తున్నామన్నారు. దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు సిలిండర్లు, అన్నదాత సుఖీభవ మొదటి విడతగా రూ. 7 వేలు ఇచ్చామని చెప్పారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులు ఇచ్చామని, మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేకంగా ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీల ద్వారా రూ. 20 లక్షల వరకు రుణాలు, అందులో రూ. 10 లక్షల వరకు వడ్డీ రాయితీ కల్పిస్తున్నామని చెప్పారు. మహిళా సాధికారత, స్వావలంబనకు టీడీపీ ప్రాధాన్యం ఇస్తుందని, మహిళలకు అవకాశం ఇస్తే అద్భుతాలు చేస్తారని, అదే నమ్మకంతో సీఎం చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారని కొమ్మాలపాటి శ్రీధర్ పేర్కొన్నారు.

పనికిరాని పనులు

(5వ పేజీ తరువాయి)

దగ్గర సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన స్వచ్ఛ జలాలు లభిస్తాయని, కానీ అంతకంటే దూరంలో కఠిన జలాలు ఉన్న చోట బోర్లు వేస్తున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీడ్ యాక్సిస్, ఎన్ 9 రోడ్డు సమీపంలో బోరు వేస్తే ఖర్చు సగానికి సగం తగ్గడంతో పాటు, శుద్ధ జలాలు వస్తాయని చెబుతున్నారు. కానీ అధికారులు స్థానికుల మాటలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు.

అతి వేగం తీసింది ప్రాణం

● డివైడర్‌ను బైక్ ఢీకొని యువకుడి మృతి

తెనాలి క్రైం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అతివేగం ఓ యువకుడి ప్రాణాలను బలికొంది. అతివేగంగా బైక్‌పై వెళుతూ అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొట్టడంతో తెనాలి యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తెనాలి మారీసుపేటకు చెందిన అన్నపరెడ్డి పవన్ (19) మార్కెట్ ప్రాంతంలోని చికెన్‌షాపులో పనిచేస్తున్నాడు. ఆదివారం చికెన్‌షాపులో అన్ని సిద్ధం చేయడానికి శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరాడు. అతను అతి వేగంగా వెళుతున్న క్రమంలో కబేళా-కొత్త వంతెన వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో పవన్ అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్వగ్రామానికి చేరిన సైనికుడి మృతదేహం

● మాజీ సైనికులు, సూర్యలంక ఎయిర్ ఫోర్స్ అధికారుల ఘన నివాళి

పొన్నూరుటౌన్, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో సైన్యంలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన హవాల్దార్ రత్న కుమార్ మృతదేహం ఆదివారం ఆయన స్వగ్రామం ములుకుదురు గ్రామానికి చేరుకుంది. రత్న కుమార్ మృతదేహాన్ని పొన్నూరు ఎక్స్ సర్వీస్ మెన్ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు లెఫ్టినెంట్ కల్నల్ ఎం రమేశ్‌బాబు ఆధ్వర్యంలో మాజీ సైనికులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సూర్యలంక ఎయిర్ ఫోర్స్ అధికారులు రత్న కుమార్ మృతదేహానికి అధికారిక లాంచనాలతో నివాళులు అర్పించారు. బంధుమిత్రుల అశ్రునయనాలతో రత్న కుమార్ భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు.

నెమలిపురి, రొంపిచర్ల మీదుగా రెండు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నెమలిపురి, రొంపిచర్ల మీదుగా తిరుప తి, చర్లపల్లికి రెండు ప్రత్యేక రైళ్లను సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలల్లో నడపాలని రైల్వేశాఖ నిర్ణయించింది. చర్లపల్లి - తిరుపతి (07013) ప్రత్యేక రైలు సెప్టెంబరు 9వ తేదీ నుంచి నవంబరు 25వ తేదీ వరకు ప్రతి మంగళవారం నడవనుండగా, తిరుపతి - చర్లపల్లి (07014) ప్రత్యేక రైలు సెప్టెంబరు 10వ తేదీ నుంచి నవంబరు 26వ తేదీ వరకు ప్రతి బుధవారం నడవనుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	111, 119, 130
చికెన్ విత్ స్కిన్(కిలో)	210.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	220.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ


గణేశుడి మండపంలో నారా రోహిత్, చిత్రం యూనిట్

పట్టణంలో 'సుందరకాండ' టీమ్ సందడి

● గణనాథుడికి నారా రోహిత్, మన్నవ పూజలు

గుంటూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మన్నవ మోహన కృష్ణ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపంలో హీరో నారా రోహిత్‌తో కలిసి ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గంలోని విద్యా నగర్లో ఎంఎంకే యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశుని మండపంలో సినీ హీరో నారా రోహిత్ సుందరాకాండ టీం సభ్యులతో కలసి ఆయన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నవ మోహనకృష్ణ సుందరకాండ చిత్రం విడుదలైన సందర్భంగా హీరో నారా రోహిత్, చిత్ర యూనిట్ సభ్యులకి శుభాకాంక్షలు తెలిపారు. గణనాథుడి ఆశీస్సులతో ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వం చల్లని పాలన కొనసాగిస్తుందని, సూపర్ సిక్స్. సూపర్ హిట్ అయిందన్నారు. నారా రోహిత్ మాట్లాడుతూ సుందరాకాండ చిత్రాన్ని అందరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు.

మనుధర్మ శాస్త్రాన్ని.. రాజ్యాంగంలో మిళితం చేస్తారా?

● ఢిల్లీ వర్సిటీ ప్రొఫెసర్ ఆచార్య రతన్ లాల్


ఆచార్య రతన్ లాల్

గుంటూరు (విద్య) ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మను ధర్మ శాస్త్రాన్ని రాజ్యాంగ బద్ధం చేయడానికి బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ రతన్ లాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం బ్రాడీపేటలోని గుర్రం జాషువా సాంస్కృతిక కళా వేదికలో భారత రాజ్యాంగం, సామాజిక న్యాయం అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆచార్య రతన్ లాల్ పాల్గొని ప్రసంగించారు. ప్రతి పౌరుడు స్వేచ్ఛ, స్వతంత్రాలతో ఉన్నప్పుడే రాజ్యాంగానికి నిజమైన విలువ లభిస్తుందన్నారు. బడుగు బలహీనవర్గాల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని సూచించారు. రాజ్యాంగం నిర్దేశించిన రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేసి బడుగులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు మొదటి నుంచి రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని, మనుధర్మ శాస్త్రాన్ని రాజ్యాంగంలో మిళితం చేసే ప్రయత్నాలు ఆందోళన కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో బీపీ మండల్ సేన అధ్యక్షుడు ఆలా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. తొలుత అమరావతి రోడ్డులోని బీపీ మండల్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆచార్య రతన్ లాల్ ఘన నివాళులర్పించారు.

ఆంగ్ల మాధ్యమంతో విశ్వ విజేతలు

గుంటూరు (విద్య) ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మాతృభాషతో పాటు ఆంగ్ల భాషను ఉపాధ్యాయులు నేర్చుకోవాలని "మేక్ యువర్ బేబీ జీనియస్" సంస్థ డైరెక్టర్ ఎస్ అశ్విని సూచించారు. ఆదివారం స్థానిక నగరంపాలెం ప్రజ్ఞ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొని, మాట్లాడారు. తమ సంస్థ ఆధ్వర్యంలో రెండు, మూడవ తరగతులు చదివే విద్యార్థులు పదవ తరగతి పుస్తకాలను అలవోకగా చదివి ఆకళింపు చేసుకునేలా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఆంగ్ల ఉపాధ్యాయులు ఈ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రీసెర్చ్ సెంటర్ వ్యవస్థాపకులు భాస్కర్ రాజు, రాఘవయ్య మాస్టారు, పాఠశాల కార్యదర్శి నాయుడు చక్ర నాగ్, ప్రిన్సిపల్ నాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమరావతి ప్రాచీన చరిత్ర.. భావితరాలకు అందేలా కృషి

● మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డొక్కా, పెనుగొండ, పున్నా తదితరులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అమరావతి చరిత్ర, ముఖ్యంగా అద్భుత శిల్ప కళలను భావితరాలకు అందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు అన్నారు. కలెక్టరేట్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్లో ఆదివారం సీనియర్ జర్నలిస్ట్ పున్నా కృష్ణమూర్తి రచించిన అమరావతి ఆర్ట్ ధరణికోట-నాగార్జునకొండ శిల్ప సంపదల సచిత్ర వ్యాస సంకలనం అనే పుస్తక పరిచయ సభ జరిగింది. పుస్తకాన్ని పరిచయం చేసిన డొక్కా మాణిక్య వరప్రసాదు మాట్లాడుతూ.. అమరావతి శిల్పాలు, చరిత్రను వెలుగులోకి తీసుకుచ్చేందుకు రచయిత చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. అమరావతి శిల్ప కళలను వెనక్కి తీసుకు వచ్చేందుకు పాలకులు చొరవ చూపాలన్నారు. పుస్తక రచయిత పున్నా కృష్ణమూర్తి మాట్లాడుతూ బ్రిటిష్ మ్యూజియంలో వేలాది యాత్రికులు అమరావతి శిల్ప సౌందర్యాన్ని తిలకించి ఆనందాశ్చర్యాలకు గురవుతుంటే.... ఆ సంపద బయటకు వెళ్లిపోయిందనే వేదన వ్యక్తిగతంగా కలిచివేసిందన్నారు. అందుకే అమరావతి ప్రాచీన చరిత్ర, వాటి శిల్ప కళలను వివరించేందుకు ఈ పుస్తకాన్ని రచించినట్లు చెప్పారు. ఈ నెల తొలి వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుస్తకాన్ని ఆవిష్కరించారని గుర్తుచేసుకున్నారు. ఈ సభకు కొరివి వినయ్‌కుమార్ అధ్యక్షత వహించగా, సభలో కేంద్ర సాహిత్య అవార్డు పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ, వావిలాల సుబ్బారావు, ధనేకుల శైలజ, సింగారావు, వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, అమరావతి అభివృద్ధి కమిటి ఛైర్మన్ జాస్తీ వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఇంటికే రేషన్ సరఫరా ఆదేశాలు రద్దు చేయాలి

గుంటూరు సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వృద్ధుల ఇళ్ల కు రేషన్ తీసుకెళ్లి ఇవ్వాలని సచివాలయం ఉద్యోగులను ఆదేశిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ/వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ డిమాండ్ చేశారు. ఆదివారం గుంటూరులో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తహసీల్దార్లు ఈ ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోందన్నారు. ఇటువంటి ఉత్తర్వులు ఇవ్వడం సచివాలయం ఉద్యోగులను అవమానించడమేనన్నారు.

పేదలకు చేతనైనంత సాయం చేద్దాం: ఎమ్మెల్యే నసీర్


తోపుడు బండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు అందించే చిరు సాయం వారి జీవితాలకు ఆధారంగా నిలుస్తుందని, అందుకోసం ప్రతి ఒక్కరూ చేతనైనంత సాయం చేయాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ పిలుపునిచ్చారు. గుంటూరు డీఎస్ నగర్‌లో ఆదివారం ఎమ్మెల్యే నసీర్ చేతుల మీదుగా వీధి వ్యాపారులకు తోపుడు బండ్లు, విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. మాజీ కార్పొరేటర్ మాలకొండయ్య సహకారంతో తోపుడు బండిని రూ.10 వేలు, ఇస్త్రీ బండిని రూ.15 వేలతో సమకూర్చారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ చిరు వ్యాపారులకు తోపుడు బండ్ల ద్వారా వారి జీవనం సాఫీగా కొనసాగుతుందని తెలిపారు.

ఉత్సవాలు సామరస్యానికి ప్రతీక

ఉత్సవాలు సామరస్యానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరూ సంతోషంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే నసీర్ పిలుపునిచ్చారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన మండపాలను ఆయన దర్శించుకున్నారు. స్వామి వారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు స్వయంగా వడ్డించారు.

తెలుగు సాహిత్యంపై చెరగని ముద్ర శ్రీశ్రీ

● కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్


ప్రసంగిస్తున్న పాపినేని శివశంకర్, వేదికపై కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సమానత్వపు పరిమళాలు గుబాళించేలా, మానవత్వం విరాజిల్లేలా మహాకవి శ్రీశ్రీ సాహిత్యం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ అన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అధ్యక్షతన బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీశ్రీ మహా ప్రస్థానం 75వ వార్షికోత్సవ సభ జరిగింది. ముఖ్య వక్తగా హాజరైన శివశంకర్ ప్రసంగిస్తూ సమాజంలో నెలకొన్న పేదరికం, నిరుద్యోగం, ఆకలి వంటి సమస్యలపై అత్యంత ఆవేదనకు గురైన శ్రీశ్రీ తన కవిత్వపు బావుటాను ఎగురవేశారన్నారు. విప్లవ రచయితల సంఘం రాష్ట్ర నాయకుడు సీఎస్సార్ ప్రసాదు మాట్లాడుతూ శ్రీశ్రీ తెలుగు సాహిత్యానికి చక్కటి వన్నె తెచ్చారని, మానవుడే తన సందేశమని చాటారని అన్నారు. శ్రీశ్రీ సాహిత్యం - నేటి ప్రాధాన్యత అనే అంశంపై జరిగిన వ్యాసరచన పోటీల విజేతలకు పాపినేని శివశంకర్ బహుమతులు ప్రదానం చేశారు. అందజేశారు. విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల కమిటీ కన్వీనర్ ఎస్.భావన్నారాయణ, కాపు శ్రీనివాస్, ప్రొఫెసర్ ఎన్.వేణు గోపాలరావు, ఎం.హనుమంతరావు, ఎల్ఎస్ భారవి, అవధానుల హరి, వివికే సురేష్ పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో మంచు మనోజ్


మనోజ్‌కు లడ్డూ ప్రసాదం అందజేత

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనక దుర్గమ్మను ఆదివారం సినీ హీరో మంచు మనోజ్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. అధికారులు మనోజ్‌కు అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం బహూకరించారు.

అన్నదానానికి విరాళాల వెల్లువ


దాత రవీంద్రబాబు దంపతులకు అమ్మవారి చిత్రపటం, రశీదు అందజేస్తున్న అధికారులు

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఉచిత ప్రసాదం పంపిణీకి గుంటూరుకు చెందిన తేగెల రవీంద్రబాబు, డాక్టర్ నాగేశ్వరమ్మ దంపతులు కుమార్తె మమత శ్రీరంగ తరఫున రూ.1,00,001, కొత్తూరుకు చెందిన మండవ శ్రీనివాసరావు, ఆదిలక్ష్మి దంపతులు అన్నదాన పథకానికి రూ.1,00,001లు విరాళంగా అందజేశారు.

మునగాకు సాగుతో మెరుగైన ఆదాయం

● డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి


రైతును సన్మానిస్తున్న డీఆర్డీఏ సిబ్బంది

గుంటూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మునగ కాయలతోనే కాదు.. మునగాకు సాగుతో కూడా మెరుగైన ఆదాయం పొందవచ్చని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పీడీ విజయలక్ష్మి పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ నేతృత్వంలో వివిధ మండలాలకు చెందిన రైతులను ఎంపిక చేసి.. ప్రకాశం జిల్లా పామూరులో మునగాకు తోటలను పరిశీలించారు. రైతు వెంగల్‌రెడ్డి గ్రామంలోని మునగ సాగు పద్ధతులపై సమగ్ర వివరణ ఇచ్చారు. అనంతరం బృందం మునగ డ్రయర్ యూనిట్‌ను సందర్శించి, రైతుల అభిప్రాయాలను సేకరించారు. రైతులు, డీఆర్‌డీఏ సిబ్బంది వెంగల్‌రెడ్డిని సన్మానించారు. అడిషనల్ పీడీ, డీపీఎం (ఎల్‌హెచ్), ఏపీఎం, ఫిరంగిపురం, అధికారులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా రావి కుటుంబ సేవా సమితి

● అధ్యక్షుడు గోపాలకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న గోపాలకృష్ణ

గుంటూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులను ఆదుకునేందుకు రావి కుటుంబ సేవా సమితి ఆధ్వర్యంలో ఏటా ఉపకార వేతనాలను అందజేస్తున్నట్లు సమితి అధ్యక్షుడు రావి గోపాలకృష్ణ తెలిపారు. ఇన్నర్ రింగ్ రోడ్డులోని స్పేస్ గార్డెన్స్‌లో సమితి రాష్ట్ర స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడారు. ఏపీ, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ప్రపంచ వ్యాప్తంగా రావి ఇంటి పేరుతో ఉన్న వారిని సమైక్య పరిచి 2017లో గుంటూరు కేంద్రంగా రావి కుటుంబ సేవా సమితి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 9 ఏళ్లుగా పేద విద్యార్థులకు రూ. 20 వేలు వంతున ఉపకార వేతనాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 240 మంది విద్యార్థులకు రూ. కోటికి పైగా ఆర్థిక సాయం అందజేసినట్లు వెల్లడించారు. సాయం పొందిన వారు ఉన్నత స్థాయికి చేరుకొని.. తిరిగి పేదలకు సహకారం అందించాలని గోపాలకృష్ణ కోరారు. కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి రమేష్, ఉపాధ్యక్షుడు మోహన్ చౌదరి పాల్గొన్నారు.

'104 ఎంఎంయూ' జిల్లా కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన యూనియన్ సభ్యులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత గుంటూరు, సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం 104 మొబైల్ మెడికల్ యూనిట్ (ఎంఎంయూ) జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశం, ఎన్నిక నిర్వహించారు. సంఘ నూతన అధ్యక్షుడిగా గోరంట్ల సురేష్, కార్యదర్శిగా ఆలూరి శ్రీహర్ష, కోశాధికారిగా ఐ.నాగులు, ఉపాధ్యక్షుడిగా కె.సత్తిరాజు, సహాయ కార్యదర్శిగా బి.బాలకృష్ణ, కమిటీ సభ్యులుగా విజయ్‌కుమార్, ఏడుకొండలు, సురేష్, సాయిరాం, విజయ్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులను యూనియన్ గౌరవ అధ్యక్షుడు లక్ష్మణరావు ప్రత్యేకంగా అభినందించారు.

మూల్యాంకనం విధానం సరిదిద్దాలి

● యూటీఎఫ్ నాయకుల డిమాండ్


మాట్లాడుతున్న కళాధర్

గుంటూరు (విద్య) ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం అమలు చేస్తున్న పరీక్ష మూల్యాంకన విధానం పూర్తిగా మారాల్సిన అవసరం ఉందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.కళాధర్ డిమాండ్ చేశారు. ఆదివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశ్నా పత్రం మూల్యాంకనం, మార్కుల నమోదు ఉపాధ్యాయులను బోధనకు దూరం చేశాయన్నారు. రాష్ట్ర సహాధ్యక్షురాలు కుసుమ కుమారి మాట్లాడుతూ.. దీనిపై త్వరలో ఆందోళన చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఎం.హను మంతరావు, పీవీ శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వర్లు, ఎండి దౌలా తదితరులు పాల్గొన్నారు.

కులగణనతో.. బీసీలకు రిజర్వేషన్ ఫలాలు

● ఏపీ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ క్రాంతికుమార్

గుంటూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు తీసుకుందని, ఆ దిశలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ కోరారు. చుట్టుగుంట సెంటర్‌లోని సంఘం కార్యాలయంలో ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కుల జనగణన జరిగితేనే బీసీలకు సరైన రిజర్వేషన్ ఫలాలు దక్కుతాయని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బీసీలకు రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. హామీలను అమలు చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడితో పాటు ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

మహా గణపతి ఆశీస్సులతో మరింత అభివృద్ధి

● ఎమ్మెల్యే గళ్లా మాధవి


భక్తులతో ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మహా గణపతి ఆశీస్సులతో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే గళ్లా మాధవి విశ్వాసం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని పలు వినాయక మండపాలను ఆదివారం ఆమె సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బృందావన్ గార్డెన్స్ మెయిన్ రోడ్డు, మారుతి నగర్, గుజ్జనగుండ్ల సెంటర్, ఉద్యోగ నగర్ తదితర ప్రాంతాల్లోని గణపతి మండపాల్లో ఎమ్మెల్యే పూజలు చేశారు. అనంతరం బృందావన్ గార్డెన్స్, గుజ్జనగుండ్ల సెంటర్, ఏటీ అగ్రహారం జీరో లైన్, 7వ లైన్‌లో జరిగిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని, భోజనం వడ్డించారు.

పారదర్శకతను కోల్పోతున్న ఎన్నికల కమిషన్

● సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్ బాబు


ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ దివాకర్‌బాబు

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల సంఘం దశాబ్ద కాలంగా స్వయం ప్రతిపత్తిని కోల్పోతూ పారదర్శకంగా జవాబుదారీ తనంతో వ్యవహరించడం లేదని సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ దివాకర్ బాబు ఆరోపించారు. ఆదివారం "రాజ్యాంగం - భారత ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తి" అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి రాజ్యాంగ చర్చా వేదిక అధ్యక్షుడు నడింపల్లి గురు దత్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దివాకర్‌బాబు మాట్లాడుతూ.. భారత ఎన్నికల కమిషన్ సభ్యుల ఎంపిక ప్రక్రియ త్రిసభ్య కమిటీలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, ఆ స్థానంలో కేంద్ర మంత్రిని పెట్టడం ద్వారా ఎన్నికల కమిషన్ స్వతంత్రతను కోల్పోయే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. బిహార్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ హడావిడిగా ప్రత్యేక సమగ్ర సవరణ ద్వారా 65 లక్షల ఓట్లను తొలగించడం, ఆధార్ కార్డును పరిగణనలోకి తీసుకోకుండా జనన ధ్రువీకరణ లాంటి పత్రాలను కోరడం హాస్యాస్పదమన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ 100 కోట్లకు పైగా ఓటర్లు ఉన్న భారతదేశంలో ఎన్నికల కమిషన్‌కు దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో సొంత సిబ్బంది ఉండాలన్నారు. రాజ్యాంగ చర్చా వేదిక అధ్యక్షులు నడింపల్లి గురుదత్, కార్యదర్శి అవధానుల హరి, సంయుక్త కార్యదర్శి టి.సేవా కుమార్, ప్రోగ్రెసివ్ ఫోరం అధ్యక్షుడు పి. మల్లికార్జునరావు, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సీపీఎం నేత నళినీ కాంత్, సామాజిక విశ్లేషకులు టి. ధనుంజయ రెడ్డి ప్రసంగించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు


శిల్పారామంలో కళాకారుల నృత్య ప్రదర్శన

గుంటూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గుంటూరు శిల్పారామంలో జరుగుతున్న రాష్ట్ర వస్త్ర ప్రదర్శన- 2025లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. ప్రదర్శనలో 'అభినయ ఆర్ట్స్ అకాడమి' ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్యం, కూచిపూడి నృత్య రూపకాలు ప్రదర్శించారు. పలు వంటి నృత్య రూపకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో హేమలత, సౌమ్య, వర్షిణి, చంద్రిక, భవిత, నృత్య దర్శకుడు సీహెచ్ వెంకట్ పాల్గొన్నారు.

మధుసూదనరావుకు.. రాష్ట్రపతి పోలీస్ మెడల్ గర్వకారణం


మధుసూదనరావునకు సత్కారం

గుంటూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారి మధుసూదనరావుకు ఈ ఏడాది రాష్ట్రపతి పోలీస్ మెడల్ రావడం శాఖకే గర్వకారణమని ఆర్‌పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ షణ్ముగం వడివేలు పేర్కొన్నారు. పట్టాభి పురంలోని డీఆర్ఎం కార్యాలయంలో జరిగిన డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ గోళ్ళమూడి మధుసూదనరావు ఉద్యోగ విరమణ సభలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. డిప్యూటీ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ వల్లేశ్వర, అసిస్టెంట్ కమిషనర్ శైలేష్‌కుమార్, అధికారులు పవన్‌సింగ్, చెంచయ్య, మర్రి సాంబశివరావు, అక్కేశ్వరరావు, మురళీకృష్ణ, రవిశంకర్, చంద్రశేఖర్, దుర్గాప్రసాద్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

స్టాంప్ వెండర్ల షెల్టర్ల తొలగింపును ఆపాలి

● జేఏసీ జిల్లా అధ్యక్షుడు షేక్ రషీద్


షేక్ రషీద్

గుంటూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జీవనోపాధి కోసం స్టాంప్ వెండర్లు, ఇతర డాక్యుమెంట్ రైటర్లు ఏర్పాటు చేసుకున్న షెల్టర్లను నగరపాలక సంస్థ తొలగించడం ఆపాలని జిల్లా స్టాంపు వెండర్ల జేఏసీ అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకుడు షేక్ రషీద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో 30 మందికి పైగా డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండర్లు బతుకుదెరువు కోసం ఏర్పాటు తాత్కాలిక షెల్టర్లతో జీవనోపాధి పొందు తున్నట్లు తెలిపారు. వైసీపీ అనుకూల అధికారులు, సిబ్బంది ఇలాంటి చర్యలకు పాల్పడుతూ ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే, ఎంపీల వినతులను సైతం బేఖాతర్ చేస్తున్నారని విమర్శించారు. వీరిపై కమిషనర్ తక్షణం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

గుంటూరు సిటీ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం వంగిపురంలోని ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీడీ సూర్య శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు జరిగిన ఈ తనిఖీల్లో సీఐ కొమ్మాలపాటి చంద్రశేఖర్, వ్యవసాయ అధికారి సీహెచ్ ఆదినారాయణ పాల్గొన్నారు. లైసెన్సులను, రికార్డులను, స్టాక్ రిజిస్టర్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కొన్ని షాపుల్లో నిల్వల్లో తేడాలు ఉండటంతో అమ్మకాల నిలిపి వేతకు ఆదేశాలు ఇచ్చినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

దంత సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

గుంటూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): దంత సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని సీనియర్ డెంటిస్ట్ డాక్టర్ కొండా ప్రత్యూష తెలిపారు. అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆరోగ్య సభలో ప్రత్యూష మాట్లాడారు. డాక్టర్ సలహా లేకుండా ఎటువంటి మౌత్ వాష్‌లు వాడరాదన్నారు. ఈ సమావేశంలో సంస్థ కార్యదర్శి శివరామిరెడ్డి, సాయిరామ్, చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై దృష్టి సారించాలి

గుంటూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య పెన్షనర్ల సమస్యలను ఆలకించాలని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చా వేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ముఖ్యమంత్రికి రాసిన ఒక లేఖలో విజ్ఞప్తి చేశారు. పెన్షనర్లకు మట్టి ఖర్చులు ఇవ్వడం లేదని, ఆరోగ్య కార్డులు పనిచేయడం లేదని తెలిపారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు, తాత్కాలిక భృతి చెల్లింపులు కూడా లేవన్నారు. ఎన్నికలప్పుడు మంచి పీఆర్‌సీ ఇస్తామని, డీఏ చెల్లింపులు చేస్తామని, ఆరోగ్య కార్డులు పనిచేసేలా చేసి పెన్షనర్లకు సంబంధించిన అన్ని సమస్యలపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఇచ్చిన హామీని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు దాటిందని, సహనంగానే ఉంటున్నారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్షీణించిందని, అందువల్లే డీఏలు ఇవ్వలేకపోతున్నామని చెప్పడం సహేతుకం కాదన్నారు. 2018 నుంచి డీఏ బకాయిలతో పాటు మొత్తం ఒక్కొక్క పెన్షనర్‌కు రూ.25 వేల వరకు చెల్లింపులు జరపాల్సి ఉందని గుర్తుచేశారు. వెంటనే సంబంధిత ఉత్తర్వులు జారీ చేయాలని వీరయ్య డిమాండు చేశారు. త్వరలో ప్రభుత్వం జారీ చేసే ఫ్యామిలీ కార్డులో పింఛన్‌దారులకు రావాల్సిన బకాయిలు మొత్తం నమోదు చేయాలని వీరయ్య కోరారు.

బై...బై..గణేశా!

●నిమజ్జనోత్సవంలో యువత సందడి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నగరంలో గణేశ్ నిమజ్జన వేడుకలు కనుల పండువగా సాగాయి. ఐదు రోజులుగా మండపాల్లో పూజలు అందుకున్న గణనాథుడి ప్రతిమలను ఆదివారం నిమజ్జనానికి తీసుకెళ్లారు. గణపతి బొప్పా మోరియా అనే నినాదాలతో పుర వీధులు మార్మోగాయి. డీజేలు, బ్యాండు మేళాలు, డప్పు చప్పుళ్ల హోరెత్తాయి. ఉత్సవాల్లో యువత, పిల్లలు ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొన్నారు. సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగులు, యువత నిమజ్జనాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షించారు.

ఘనంగా నిమజ్జన వేడుకలు


నిమజ్జనోత్సవంలో సందడి


లడ్డూ ప్రసాదంతో అపార్ట్‌మెంటు వాసులు

గుంటూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గుంటూరు కంకరగుంట సమీపంలోని స్కైలైన్ అపార్ట్‌మెంట్‌లో ఆదివారం వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. లడ్డూ వేలం పాటలో ఈస్ట్ ఎండ్ నివాసి బొమ్మనబోయిన శ్రీనివాసరావు రూ.22వేలకు దక్కించుకున్నారు. వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.మోహనరావు ఆధ్వర్యంలో అన్న ప్రసాదం వితరణ ఘనంగా నిర్వహించారు. కమిటీ నిర్వాహకులు మండవ ప్రసాద్, జి.రాజశేఖరశర్మ, విశ్రాంత తహసీల్దార్ జి. గంగయ్య, గంటా శేషగిరిరావు పాల్గొన్నారు.

రోగులకు సాయం చేసే అవకాశం అదృష్టం

● రోటరీక్లబ్ గుంటూరు జిల్లా గవర్నర్

దుగ్గిరాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కుష్ఠురోగులకు నాలుగుదశాబ్దాలకు పైగా సేవలందిస్తూ గ్రెటనాల్టెస్ వంటి సేవాసంస్థలకు సహకారం అందించ డం తమ అదృష్టంగా భావిస్తున్నామని రోటరీక్లబ్ గుంటూరు జిల్లా గవర్నర్ ఎస్వీ ప్రసాద్ అన్నారు. మోరంపూడి గ్రామంలోని గ్రెటనాల్టెస్‌లో కుష్ఠురోగు లకు అవసరమైన 25 బెడ్లు, దిండ్లు, దుప్పట్లు తదితర అత్యవసరాలను వైకుంఠపురం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అందించారు.

పీజీఆర్ఎస్‌కు అధికారులు హాజరుకావాలి

● తహసీల్దార్ హేనాప్రియ

పెదనందిపాడు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారవేదికకు మండలంలోని అన్ని శాఖ ల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తహసీల్దార్ హేనాప్రియ ఆదివారం తెలిపారు. ఉదయం 10గంటలకు జిల్లా ఉన్నతాధికారులతో జరుగు వీడి యో కాన్ఫరెన్స్‌లో పాల్గొని, అనంతరం ప్రజల నుంచి వచ్చే వినతులను ఆయా శాఖ అధికారులు స్వీకరించి సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

నేడు విద్యుత్‌సరఫరాకు అంతరాయం

దుగ్గిరాల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పెదపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సోమవారం మధ్యాహ్నం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ గోపి తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో 33.11కేవీ ఫీడర్ కింద కొత్తవిద్యుత్ లైన్ల ఏర్పాటు నిమిత్తం చుక్కపల్లివారిపాలెం, పేరుకలపూడి, చిన పాలెం, పెద పాలెం గ్రామాలకు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5.30గంటల వరకు ఇళ్లకు, పొలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ చెప్పారు.

రేపటి నుంచి పవిత్రోత్సవాలు

మంగళగిరి సిటీ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహ స్వామి దేవ స్థానంలో ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరుగుతాయని కార్యనిర్వహణాధికారి కే.సునీల్‌కుమార్ తెలిపారు. ప్రతిరోజు స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరా రు.

కోలాహలంగా గణనాథుడి నిమజ్జనాలు


పూజల్లో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ కిరణ్‌చంద్ తదితరులు


వట్టిచెరుకూరు: పుల్లడిగుంటలో వినాయకుడి లడ్డూతో ఉప్పుటూరి చినరాములు


ఎర్రబాలెంలో భక్తులకు అన్నదానం చేస్తున్న మస్తాన్‌రావు, కమిటీ ప్రతినిధులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాలు ఆదివారం 5వ రోజు కావడంతో కృష్ణానదిలో విగ్రహాల నిమజ్జనాలు ప్రారంభమయ్యాయి. గుంటూరుతోపాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు విగ్రహాల నిమజ్జనం కోసం తాడేపల్లి పరిధిలోని సీతానగరం పుష్కర ఘాట్‌ల వద్దకు తరలి వస్తున్నారు. నది వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా మున్సిపల్ అధికారుల సహకారంతో అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టినట్టు తాడేపల్లి ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలిపారు.

● తాడేపల్లి ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి ఫ్రెండ్లీ గణేష్ కమిటీ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 3వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. లడ్డు వేలంపాటలో కుంచనపల్లికి చెం దిన చుక్కా మధు లడ్డు వేలంపాటలో పాల్గొని రూ.2 లక్షల 75వేల116కు లడ్డును చేజిక్కించుకున్నారు.

● తాడేపల్లి పట్టణ వైఎస్సార్ సెంటర్ 2వ రోడ్డులో వీసా ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన నిర్వహించిన లడ్డు వేలంపాటలో 31కేజీల లడ్డును రూ.3.67లక్షలకు మేకా శ్రవణ్‌రెడ్డి దక్కించుకున్నా రు. 11కేజీల లడ్డును రూ.75వేలకు కారుమూరి సురేంద్రరెడ్డి దక్కించుకోగా, మణిహారాన్ని రూ.1,01,116కు కేసరి శ్రీనివాసరెడ్డి చేజిక్కించుకున్నారు.

● తాడేపల్లి బైపాస్ రోడ్డులోని నారా లోకేశ్ క్రీడా ప్రాంగణంలో శనివారం రాత్రి ఏపీ నాటక అకాడమి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, హంస అవార్డు గ్రహీత కళారత్న పోషకులు కోమటి జయరాం, ప్రాతూరు అధ్యక్షుడు అరవపల్లి శ్రీనివాస్, వల్లభనేని వెంకట్రావు, దాసరి కృష్ణ ఆధ్వర్యంలో గణనాథునికి పూజలు నిర్వహించారు.

● మంగళగిరి మండలంలోని పెదవడ్లపూడిలో శ్రీవినాయక ఆర్ట్స్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

● మంగళగిరి మండలం ఎర్రబాలెంలోని సినిమా హాలు సెంటర్లో కార్యసిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మందిరం వద్ద భక్తులకు అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, పీఈపీఎల్ అధినేత పితాళ్ల మస్తాన్‌రావు, మంగళగిరి పీఏసీఎస్ చైర్మన్ గాదె పిచ్చిరెడ్డి, శ్రీకాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్టు చైర్మన్ పందేటి సాంబశివరావు పాల్గొన్నారు.

● మంగళగిరి తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయం నుంచి తాడేపల్లిలోకి బకింగ్ హామ్ కెనాల్ వరకు టీడీపీ శ్రేణులు వినాయకుడిని ఊరేగింపుగా తీసుకువచ్చి కెనాల్‌లో ఆదివారం రాత్రి నిమజ్జనం చేశారు. తెలుగుదేశం శ్రేణులు భారీగా పాల్గొని జెండాలు పట్టుకొని కనకతప్పెట్లతో ఉత్సాహంగా నిమజ్జనయాత్ర నిర్వహించారు.

● పెదనందిపాడు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గణనాథులను కోలాహలంగా ఆదివారం నిమజ్జనాలకు తరలించారు. ఆయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లపై డప్పువాయిద్యాలు, భాణాసంచా పేలుళ్ల నడుమ నిమజ్జనాలకు తరలించారు.

● వట్టిచెరుకూరు మండల వ్యాప్తంగా గ్రామాల్లో నిర్వాహకులు వినాయక విగ్రహాలను ఊరేగింపు చేస్తూ నిమజ్జనానికి తరలిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రమానాయక్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. పుల్లడిగుంటలో జరిగిన లడ్డూ వేలంపాటలో రూ.లక్షలకు ఉప్పుటూరి చినరాములు లడ్డును కైవసం చేసుకున్నారు.

● దుగ్గిరాల మండలంలోని పలుగ్రామాల్లో వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన మండపాల్లో విగ్రహాల నిమజ్జనోత్సవాలు ఆదివారం కొనసాగాయి. చింతలపూడి లోని రామాలయం సెంటర్లో ఏర్పాటు చేసిన వినాయకుని లడ్డూను గ్రామానికి చెందిన జవ్వాది రవి కుమారులు నంద, మణిలు వేలంలో రూ.24వేలకు దక్కించుకున్నారు.

● ఫిరంగిపురం మండలంలోని మునగపాడు గ్రామంలో తెలుగు యువత ఆధ్వర్యం లో గణేష్ నిమజ్జన కార్యక్రమంలో శ్రీ కృష్ణ చైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ కొల్లి బ్రహ్మయ్య లడ్డును వేలంపాట పాడి టీడీపీ నేతకు అందజేశారు. ఈ లడ్డు రూ.72వేలకు పలికింది. యువత మేళతాళాలతో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు.


అపర్ణ అమరావతి-1 గణేష్ లడ్డును రూ.6.81 లక్షలకు దక్కించుకున్న కె.కిరణ్‌రెడ్డి, శ్రీలత దంపతులు


గణేష్ ఉత్సవ కమిటీ ఏర్పాటుచేసిన వినాయకుడు

అపర్ణ అమరావతి-1 గణేష్ లడ్డు రూ.6 లక్షలు

తాడేపల్లి (ప్రాతూరు), ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎం సీ పరిధిలోని ప్రాతూరు కుంచనపల్లి మార్గంలో ఉన్న అపర్ణ అమరావతి-1 గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వినాయక ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన లడ్డు వేలం పాటలో కొండూరి కిరణ్‌రెడ్డి, శ్రీలత దంపతులు 6లక్షల 81 వేల 3 రూపాయలకు లడ్డును దక్కించుకున్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించి, ప్రత్యేక పూజా కార్యక్రమాలతోపాటు సాం స్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. కొండూరు కిరణ్‌రెడ్డి, శ్రీలత దంపతులు మాట్లాడుతూ లడ్డును దక్కించుకోవడం తమకు ఎంతో ఆనందంగా ఉందని, విఘ్నేశ్వ రుని ఆశీస్సులు తమకు ఎప్పుడూ ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజేష్, కార్యదర్శి రాజేష్, జాయింట్ సెక్రటరీ రత్నసాగర్, ట్రెజరర్ బ్రహ్మారావు, సభ్యులు రఘురాం, షబ్బీర్, కళ్యాణ్, అన్నపూర్ణ, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంగళాయపాలెంలో నిమజ్జన వేడుకలు


వెంగళాయపాలెంలో వినాయకుడికి హారతి ఇస్తున్న మహిళలు


వేలంలో రూ.2లక్షలకు లడ్డూ కైవసం చేసుకున్న ముప్పాళ్ల ఆంజనేయులు తదితరులు

మేడికొండూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెంలో శ్రీకోదండ రామస్వామి ఆలయం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేడుకలు ముగింపులో భాగంగా ఆదివారం వినాయక నిమజ్జన కార్యక్రమం కోలాహలంగా జరిగింది. గ్రామ వీధుల్లో మేళతాళాలతో వినాయకుడిని ఊరేగింపుగా భక్తులు నిమజ్జనానికి తరలివెళ్లారు. ఈసందర్భంగా నిర్వహించిన స్వామి వారి లడ్డూ వేలంపాటలో ముప్పాళ్ల ఆంజనేయులు రెండు లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో మన్నవ రమేష్, ఈడపాలపాటి శివయ్య, పాటిబండ్ల వెంకటేశ్వరరావు, ముప్పాళ్ల శ్రీను తదితరులతో పాటు కోదండ రామస్వామి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు నుంచి పురస్కారం అందుకుంటున్న దాసరి రమేష్

కొండేపాడు యువకుడికి సర్వేపల్లి రాధాకృష్ణన్ పురస్కారం

ప్రత్తిపాడు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సదరన్ ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ అందించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ పురస్కారంను కొండేపాడు గ్రామానికి చెందిన దాసరి రమేష్ అందుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సంస్థ నిర్వాహకుడు నాగయ్య చేతుల మీదగా ఈ పురస్కారం అందుకున్నారు. విద్యారంగంలో ఉపాధ్యాయుడిగా విభిన్న ప్రతిభ చూపినందుకు గాను రమేష్‌కు ఈ పురస్కారం దక్కింది. చలపతి విద్యాసంస్థల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారం అందుకున్నారు.

స్మార్ట్ కార్డులు పంపిణీ


మేడికొండూరు: సిరిపురంలో స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు


తుళ్లూరు: పెదపరిమిలో అందజేస్తున్న తహసీల్దార్, టీడీపీ నేతలు

మేడికొండూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన స్మార్ట్ రైస్ కార్డ్‌లను ఆదివారం సిరిపురం గ్రామంలో టీడీపీ నాయకులు ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వరగాని సొసైటీ చైర్మన్ కడియాల గణేష్‌బాబు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పద్ధతిలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న కూటమి విధానం హర్షణీయమని కొనియాడారు. మేడికొండూరులో గ్రామ సర్పంచ్ పూల నాగమణి, టీడీపీ నాయకులు పాములపాటి యలమంద, శ్యామ్‌బాబు తదితరులు పాల్గొని స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు.

పెన్షన్ పంపిణీ చేయనున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ కుమార్ సోమవారం ఉదయం సిరిపురం, సరిపూడి, వెలవర్తిపాడు గ్రామాల్లో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని టీడీపీ మండల నాయకులు ఆదివారం తెలిపారు.

● తుళ్లూరు: ఏటీఎం కార్డుల మాదిరిగా స్మార్ట్ రేషన్ కార్డులను కూటమి ప్రవేశపెట్టింది. ఆదివారం పెదపరిమిలో స్మార్ట్ రేషన్ కార్డులను తహసీల్దార్ హరిబాబు, టీడీపీ నాయకులు లబ్ధిదారుల గృహాలకు వెళ్లి అందజేశారు. ఐదు రోజులలో పంపిణీ పూర్తి చేస్తారు. అందని లబ్ధిదారులకు రేషన్‌సరుకులు తసుకునేటప్పుడు డీలర్లు అందజేస్తారని రెవెన్యూ అధికారులు తెలిపారు.

యడ్లపల్లికి అభినందనల వెల్లువ


సాంబశివరావును అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తాడికొండ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఏపీ ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డ్ డైరెక్టర్‌గా నియమితులైన యడ్లపల్లి సాంబశివరావును ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అభినందిం చారు. ఆదివారం ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌ను నియోజకవర్గంలోని టీడీపీ నాయకులతో కలిసి యడ్లపల్లి సాంబశివరావు మర్యాదపూర్వకంగా కలిశారు. డైరెక్టర్‌గా పదవి పొందిన యడ్లపల్లి సాంబశివరావుకు శుభాకాంక్షలు తెలియజేసి ఏపీ ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డ్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో విలేజ్ ఇండస్ట్రీస్ నెలకొల్పే వారి కి సహాయ సహకారాలు అందించి వారి ఉన్నతకి తోడ్పాటునందించాలని తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు మోతడక గ్రామంలో, తాడికొండ పార్టీ కార్యాలయంలో సాంబశివరావును టీడీపీ సీనియర్ నాయకులు ఎడ్డూరి హనుమంతరావు ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు దామినేని శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్న కుమార్, గుంటుపల్లి మధు సూదనరావు, చిగురుపాటి అనూప్, ముక్కెర శ్రీనివాసరావు, షేక్ రఫీ, షేక్ అల్లాభక్షు, ఆలపాటి బాలయ్య పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

మంగళగిరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దామర్ల శివరామకృష్ణ, రామసీతమ్మ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి మార్కండేయ పద్మశాలీయ కల్యాణ మండపం లో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ట్రస్టు ద్వారా మంగళగిరితోపాటు ఐలవ రం, పేటేరు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు డీఎస్సార్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ డీఎస్ఎస్ శ్రీనివాసరావు తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

వట్టిచెరుకూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతవరప్పాడు గ్రామంలోని రజక చెరువులో శుక్రవారం ఉదయం దూకి గల్లంతైన గుర్తు తెలి యని యువకుడి మృతదేహం శనివారం ఉదయం చెరువు నీటిలో గుర్తించా రు. వీఆర్‌ఏ రమణ, ఆ ప్రాంతంలోని వారు యువకుని మృతదేహం నీటిలో తేలి యాడటాన్ని గుర్తించి ఇన్‌చార్జ్ వీఆర్‌వోకు సమాచారం ఇచ్చారు. వీఆర్‌వో సమాచారంతో ట్రెయినీ ఎస్ఐ సీహెచ్ వెంకటసాయి కుమార్, గ్రామ సర్పంచ్ దారా వెంకటరావు, ఉపసర్పంచ్ యర్రగుంట్ల శేఖర్ సంఘటనా స్థలానికి చేరు కొని మృత దేహాన్ని బయటకు తీశారు. ఆ వ్యక్తి ఈ ప్రాంతానికి చెందిన వా డు కాదని, ఎక్కడి నుంచే వచ్చి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకొని ఉంటాడని గమనించి మృతదేహాన్ని గుంటూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చు రీకి తరలించారు. రెండు మూడు రోజులు అక్కడే ఉంచుతామని పోలీసులు వెల్లడించారు.


గుర్తు తెలియని యువకుడి మృతదేహం

చలో విజయవాడను జయప్రదం చేయాలి

మంగళగిరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19వ తేదీన జరిగే చలో విజయవాడ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ నేత రాఘవులు పిలుపునిచ్చారు. మంగళగిరి సీఐటీ యూ కార్యాలయంలో ఆదివారం రాత్రి నవులూరు ఆటో స్టాండ్ సర్వసభ్య సమావేశం సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. రాఘవులు మాట్లాడుతూ ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చలో విజయ వాడ జరుగుతుందని తెలిపారు. సమావేశంలో యూనియన్ కార్యదర్శి టీ శ్రీరాములు, రహంతుల్లా, గోపి తదితరులు పాల్గొన్నారు.

రామాలయం వద్ద లక్ష్మీగణపతి హోమం


ఫిరంగిపురంలో 50 మంది దంపతులు హోమం చేస్తున్న దృశ్యం

ఫిరంగిపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఫిరంగిపురంలోని రామాలయం వద్ద గణేష్ నవరాత్రులను పురస్కరించుకొని ఆదివారం ఉదయం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి హోమంను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా 50 మంది దంపతులు వినా యకుడికి ప్రత్యేక పూజలు చేసి హోమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి విశేష కృషి

● సంగం డెయిరీ డైరెక్టర్ వెంకట సుబ్బయ్య


పాడి రైతుకు బోనస్ పంపిణీ చేస్తున్న సంగం డెయిరీ డైరెక్టర్ వెంకట సుబ్బయ్య, శ్రీనివాసరావు తదితరులు

కాకుమాను, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమానికి సంగం డెయిరీ విశేష కృషి చేస్తుందని డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు అన్నారు. మండపరిధిలోని చినలింగాయపాలెం శివారు పెద్దివారిపాలెం మిల్క్ ప్రొడ్యూసర్స్ వేల్ఫేర్ సొసైటీలో ఆదివారం 21 మంది పాడి రైతులకు రూ.47,251 బోనస్‌ను సంగం డెయిరీ డైరెక్టర్లు గొల్లపూడి శ్రీనివాసరావు, దేవిరెడ్డి వెంకట సుబ్బయ్యలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌లు మాట్లాడుతూ ప్రతి పాడి రైతుకు మేలు జరిగే విధంగా ప్రతి ఏడాది క్రమం తప్పకుండా బోనస్ పంపిణీ చేస్తున్న సంస్థ సంగం డెయిరీ అన్నారు. కార్యక్రమంలో స్థానిక అధ్యక్షుడు మాకినేని బాపూజీ, పాడి రైతులు పాల్గొన్నారు.

కార్మికులకు ఉరితాళ్లుగా లేబర్ కోడ్‌లు: సీఐటీయూ


ప్రసంగిస్తున్న సీఐటియూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం రవి

తాడేపల్లి (ఉండవల్లి), ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లు అమలు జరిగితే అవి కార్మికులకు ఉరితాళ్లుగా మారతాయని సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం రవి అన్నారు. ఆదివారం ఆవుల నారాయణ అధ్యక్షతన ఎంటీఎంసీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల విస్తృత సమావేశం నిర్వహించా రు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవి మాట్లాడుతూ పాలకులు కార్పొరేట్ అనుకూల విధానా లు చేపడుతూ కార్మికవర్గాన్ని అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉండవల్లి కమిటీని 11మందితో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆవుల నారాయణ, కార్యదర్శిగా మాగులూరి స్వర్ణకుమారి మరో 9మందితో కమిటీని ఎన్నుకున్నారు.

రూ.1.60 లక్షలతో తాగునీటి సదుపాయం


దుగ్గిరాలలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో శంకుస్థాపనలో పాల్గొన్న రోటరీక్లబ్ జిల్లా గవర్నర్ ఎస్వీ రామ్‌ప్రసాద్, హెచ్‌ఎం శోభాదేవి

దుగ్గిరాల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని జడ్పీ బాలికోన్నత పాఠ శాలలో రక్షిత తాగునీటి సౌకర్యార్థం, వాషింగ్ ప్లాట్ ఫారం, కుళాయిల ఏర్పా టుకు ఆదివారం శంకుస్థాపన చేశారు. తెనాలి వైకుంఠపురం రోటరీక్లబ్ ఆధ్వ ర్యంలో రూ.1.60లక్షలతో పనులు చేపట్టనున్నారు. పాఠశాల ఆవరణలో శ్రీసరస్వతీదేవి విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం, భూమి పూజ చేసిన రోటరీక్లబ్ జిల్లాగవర్నర్ ఎస్వీ రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు సేవా కార్యక్రమాలు చేపట్టడంలో రోటరీక్లబ్ ముందుంటుందని అన్నారు. అసిస్టెంట్ గవర్నర్ ఈదర పూర్ణచంద్రరావు, హెచ్‌ఎం శోభాదేవి, టీడీపీ నాయకులు గూడూరు వెంకట్రావు, వల్లూరి నరసింహారావు, గద్దె శ్రీనివాస్ తదితర నాయ కులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు


వంగిపురం ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ప్రత్తిపాడు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం వంగిపురంలోని ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీడీ సూర్య శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు జరిగిన ఈ తనిఖీల్లో సీఐ కొమ్మాలపాటి చంద్రశేఖర్, వ్యవసా య అధికారి సీహెచ్ ఆదినా రాయణ పాల్గొన్నారు. లైసెన్సు లను, రికార్డులను, స్టాక్ రిజిస్టర్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కొన్ని షాపుల్లో నిల్వల్లో తేడాలు ఉండటంతో అమ్మకాల నిలిపివేతకు ఆదేశాలు ఇచ్చినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

భగవదుత్సవానుక్రమణికా గ్రంథం ఆవిష్కరణ

మంగళగిరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మంగళగిరికి చెందిన నల్లూరి శ్రీరామచంద్ర భట్టాచార్యులు సంకలనం చేసిన భగవదుత్సవానుక్రమణికా గ్రంథాన్ని ఆదివారం ఆవిష్క రించారు. మంగళగిరి దేవస్థానం వద్ద గల శ్రీవాసిరెడ్డి కళావేదికలో వీవీఐటీ విశ్వవిద్యాల యం చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ ఈ గ్రంథాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి డాక్టర్ బులుసు శివశంకరరావు, హిందూ కళాశాల పూర్వ ప్రధాన ఆచార్యులు దీవి నరసింహ దీక్షితులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్చక ట్రైనింగ్ అకాడమీ పూర్వ సంచాలకులు వేదాంతం రాజగోపాల చక్రవర్తి, తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం డీన్ ఆచార్య వేదాంతం శ్రీ విష్ణు భట్టాచార్యులు, తిరుమల ధర్మపురి వైఖానసాగమ స్మార్త నల్లూరి మోహన రంగాచార్యులు, నృసింహా లయ ఈవో కోగంటి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


భగవదుత్సవానుక్రమణికా గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న విద్యాసాగర్ తదితరులు

విద్యా సంస్థల్లో పోస్టులను భర్తీ చేయాలి

మంగళగిరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి సీకే విద్యాసంస్థలు, వీటీజేఎం, ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలల్లోని పోస్టులను భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ మంగళగిరి శాఖ విస్తృత సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. మంగళగిరి పట్టణ అధ్యక్షుడిగా అబ్దుల్ గని, కార్యదర్శిగా పఠాన్ మున్నా, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ ఇర్ఫాన్, సహాయ కార్యదర్శిగా ఎస్కే సమీర్ తదితరులను ఎన్నుకున్నట్టు ప్రకటించారు. విట్, ఎస్ఆర్ఎం, అమృత వంటి ప్రైవేటు యూనివర్సిటీల్లో పేద విద్యార్థులకు 20 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నేత బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

తాడికొండ(రావెల), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రావెల గ్రామంలో నందమూరి రామయ్య మిత్ర మండలి ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సహకారంతో ఆదివారం ఏర్పటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి శుక్లాల ఆపరేషన్లు చేయించుకునే వారికి ఉచితంగా చేయనున్నారు. కార్యక్రమంలో రావెల సొసైటీ అధ్యక్షులు దగ్గుమల్లి శ్రీనివాసరావు, టీడీపీ సీనియర్ నాయకులు కొమ్మినేని రామచంద్రరావు, బండ్ల కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ పాములు, డాక్టర్ అనూష, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

తెనాలి అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వడ్లమూడి కోటయ్య చౌదరి చారిటీస్ ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ట్రస్టీ వడ్లమూడి గోవర్ధనరావు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్, మెడిసిన్, పోస్టు గ్రాడ్యుయేట్, డిగ్రీ, డిప్లొమో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులు ఇంటర్‌లో 80శాతం పైగా మార్కులు సాధించి ఉండాలని, ఎంసెట్‌లో 20వేల లోపు ఉండాలని తెలిపారు. దరఖాస్తులను వడ్లమూడి కోటయ్య చౌదరి చారిటీస్ కార్యాలయం 2-4-27 కాజావారి వీధి, గాంధీనగర్ తెనాలికి పంపాలని వివరాలకు 9951004820లో సంప్రదించాలని కోరారు.

రీ-సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

● తొలి దశలో మూడు గ్రామాల్లో పూర్తి
● మరో ఐదు గ్రామాలకు ప్రతిపాదనలు


రీ సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

పొన్నూరు టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న భూమి రీ-సర్వే ప్రాజెక్టులో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నదాతలు భావిస్తున్నారు. గత ప్రభుత్వంలో రీ సర్వే ప్రాజెక్ట్ చేపట్టినప్పటికీ.. సర్వే ప్రక్రియ సాగినంత కాలం రెవెన్యూ రికార్డులు ఆన్‌లైన్ నుంచి తప్పించడంతో భూమి క్రయవిక్రయాలకు అవకాశం లేకుండా పోయింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రీసర్వే ప్రాజెక్ట్ చేసిన అధికారులు , సిబ్బంది తప్పిదాలు రైతులకు శాపంగా మారాయి. అలాగే జాయింట్ ల్యాండ్ పార్సిల్ మ్యాప్ రూపొందించడం, భూమి హక్కు పత్రాలు నలుగురు ఐదుగురుకు రైతులకు కలిపి నమోదు కావడంతో రైతుల పేరుతో ఉన్న భూమి కన్నా అధిక భూమి రికార్డుల్లో చూపించింది. దీంతో సన్న, చిన్న కారు రైతులకు సాంకేతిక సమస్యలు కొత్త చికాకులు తెచ్చిపెట్టి మరిన్ని చిక్కుముడులు పడ్డాయి.

మూడు గ్రామాల్లో సర్వే పూర్తి

మండల పరిధిలోని వల్లభరావుపాలెం గ్రామంలో భూమి కొలతలు పూర్తి చేసి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను అధికారులు చేపట్టారు. గ్రామంలో 4,256 ఎకరాలు భూమి ఉండగా గతంలో 771 సర్వే నంబర్లలో ఈ విస్తీర్ణం ఉండేది.. ప్రస్తుతం ల్యాండ్ పార్సిల్ మ్యాపుల ద్వారా 3,404 నంబర్లలో మ్యాపులను రూపొందించి 4,665 రైతు ఖాతాల్లో మొత్తం భూ విస్తీర్ణం నమోదు చేశారు. గ్రామంలో దశాబ్దాలుగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు దాదాపు పరిష్కారం చూపించారు.

● దండమూడి గ్రామంలో 1,393 ఎకరాలకు సంబంధించి 754 రైతు ఖాతాలు నమోదులో 1336 ఎల్‌పీఎం మ్యాపులు రూపొందించారు.

● పచ్చలతాడిపర్రు గ్రామంలో 1,417 ఎకరాల భూ రికార్డులను సవరించి 1,312 ల్యాండ్ పార్సిల్ మ్యాపులను రూపొందించారు. ఈ మూడు గ్రామాల్లో భూ సమస్యలను శాశ్వత పరిష్కారం లభించడంతో పొన్నూరు మండలంలో మరో ఐదు గ్రామాల రీ సర్వే ప్రాజెక్టు చేపట్టాలని రెవెన్యూ సర్వే విభాగం అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు.

తెనాలి మున్సిపల్ కమిషనర్‌గా శ్రీకాంత్‌కు పూర్తి అదనపు బాధ్యతలు

తెనాలి, ఆగస్టు 31, (ఆంధ్రజ్యోతి): తెనాలి మున్సిపల్ కమిషనర్‌గా ఇదే మున్సిపాలిటీలో మున్సిపల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు నెలల క్రితం శేషన్నను సాధారణ బదిలీల్లో భాగంగా బదిలీ చేయటంతో, అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న లక్ష్మీపతిరావుకు అప్పట్లో పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ నెల 30న ఆయన పదవీ విరమణ చేయటంతో ఆయన స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పిస్తారని అందరూ భావించారు. అయితే మరోసారి ఎఫ్‌ఏసీతో కూడిన ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎం.ఇగా పనిచేస్తున్న శ్రీకాంత్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు శ్రీకాంత్ కమిషనర్‌గా కొనసాగుతారని, పురపాలక శాఖ డైరెక్టర్ పి.సంపత్ కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అన్న క్యాంటీన్‌కు ఆర్వో ప్లాంట్లు

తెనాలి అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్న క్యాంటీన్‌లో తాగునీటి కోసం ఆర్వో ప్లాంటు అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్లాంటుకు కొడాలి వెంకటేశ్వరరావు, భారతీదేవి, కావూరి శివరామకృష్ణ, అఖిలాండేశ్వరమ్మ కుటుంబ సభ్యులు డాక్టర్ రవీంద్రనాథ్, ఈదర వెంకటపూర్ణచంద్ ఆర్థిక సహకారం అందజేశారు.


సత్కారం అందుకుంటున్న ప్రజ్ఞాచారి

ప్రజ్ఞాచారికి తెలుగు భాషోత్సవాలలో సత్కారం

తెనాలి అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో జరుగుతున్న తెలుగు భాషోత్సవాలలో కొలకలూరుకు చెందిన సాహిత్యవేత్త పూర్ణ ప్రజ్ఞాచారి సత్కారం అందుకున్నారు. లలిత విభూషిత తెలుగు పదము అనే శీర్షికతో ఆయన పద్యపఠనం చేశారు. విశ్రాంత ఉపకులపతి కొలకలూరి ఇనాక్, నిర్వాహకులు చలపతిరావు, విజయ్‌కుమార్‌లు ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. సాహితీ రంగంలో ఆయన చేస్తున్న సేవలను గుర్తించి అభినందించారు.


పురస్కారం అందుకుంటున్న రహీం సాహెబ్

కవి రహీం సాహెబ్‌కు సాహితీ పురస్కారం

పొన్నూరు టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణానికి చెందిన కవి, గాయకుడు, ఆర్టీసీ కండక్టర్ షేక్ రహీం సాహెబ్ సాహితీ పురస్కారం అందుకున్నారు. నెల్లూరులో గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఈ నెల 29, 30, 31 తేదీలలో ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సేవ ఆధ్వర్యంలో సాహితీ సమ్మేళనం జరిగింది. పొన్నూరుకి చెందిన షేక్ రహీం సాహెబ్ అచ్చ తెలుగు అనే కవిత గానానికి ఆహూతుల ప్రశంసలు అందుకున్నారు. ఆచార్య కొలకలూరి ఇనాక్ చేతుల మీదుగా సాహితీ పురస్కారం అందుకున్నారు.

అర్ధచాతుర్మాస్య వ్రతదీక్ష

తెనాలి అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక కమిషన్ మర్చంట్ హాలులో అర్ధచాతుర్మాస్య వ్రత దీక్ష మహోత్సవాలు ఘనంగా జరుపుతున్నారు. ప్రజ్ఞానంద సరస్వతి ఆధ్వర్యంలో ఆదివారం గణపతికి గరిక పూజలు చేశారు. విద్యార్థులకు ఆశీర్వచనం అందించారు. సాలిగ్రామ మఠం ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకటకృష్ణమూర్తి, కార్యదర్శి రావూరి సుబ్బారావు, ముద్దాభక్తుని రమణయ్య, రామమోహనరావు, మురళి పాల్గొన్నారు.

10 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు

పొన్నూరు టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10వ తేదీ వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడే అవకాశం ఉందని విద్యుత్ శాఖ ఏడీఈ వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్తిపాడు నుంచి వచ్చే 220 కేవీ విద్యుత్తు లైన్లో మరమ్మతులు చేపట్టినట్లు పేర్కొన్నారు. సోమవారం నిడుబ్రోలు 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పట్టణ ఏఈ శంకర్‌రావు తెలిపారు.

కోలాహలంగా గణనాథుల నిమజ్జనాలు


గణనాథుని పూజల్లో పాల్గొన్న మంత్రులు పెమ్మసాని, నాదెండ్ల

పొన్నూరుటౌన్, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పర్వదినం సందర్భంగా కొలువుదీరిన గణనాథుల నిమజ్జనాలు ఆదివారం పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో కోలాహల వాతావరణంలో జరిగాయి. చేబ్రోలులోని విగ్రహాలను కొమ్మమూరు కాలవ వద్దకు తరలించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కొమ్మమూరు కాలువ వద్ద ఎటువంటి ఏర్పాట్లు లేకపోవడంతో నిమజ్జనాలకు తరలివచ్చిన భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కాలువ వద్ద ఇటీవల ఏర్పడిన మట్టి కోత అవాంతరంగా మారింది. పోలీసులు ఎటువంటి అవాంఛనీయ ఘటనలో జరగకుండా జాగ్రత్తలు పాటించారు. పొన్నూరు పురపాలక సంఘం పరిధిలో మండపాల్లో కొలువుదీరిన గణనాథుల నిమజ్జన ఊరేగింపులు వైభవంగా నిర్వహించారు. కోలాట ప్రదర్శనలు, భక్తి పాటలు ఆకట్టుకున్నాయి. పట్టణంలోని భావనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్వీ యూత్ మండపం వద్ద, చింతలపూడి కాకతీయ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

● కొల్లిపర: మండలంలో ఐదు రోజులుగా వినాయకచవితి ఉత్సవాలు కనుల పండుగగా నిర్వహిస్తున్నారు. ఆదివారం వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, చివలూరు, దావులూరు, చక్రాయపాలెం, అత్తోట తదితర గ్రామాల్లో గణనాథునికి అంగరంగ వైభవంగా భక్తులు పూజలు చేశారు. కృష్ణానదిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

గణనాథుడి ఆశీస్సులు ఉండాలి: పెమ్మసాని

తెనాలి అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఏ పని తలపెట్టిన విఘ్నం లేకుండా గణనాథుడి ఆశీస్సులు అందించాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. రూరల్ మండలం నంది వెలుగు దుర్గా యూత్, భారత్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవ పూజల్లో రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. నన్నపనేని లింగారావు, గోపిచంద్, సుధీర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


కొల్లిపరలో వినాయకుడి విగ్రహం ఊరేగింపు

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

● పొన్నూరు టౌన్: పొన్నూరు పట్టణంలోని 29, 30 వార్డులు, మండల పరిధిలోని మామిళ్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల్లో ఆదివారం ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండపాల నిర్వహకులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షించి నిర్వాహకులను నృత్యకారులను ప్రత్యేకంగా అభినందించారు. మామిళ్లపల్లి గ్రామంలో వినాయక నిమజ్జనంలో పాల్గొని, గణనాథుడు ఊరేగుతున్న ట్రాక్టర్‌ను స్వయంగా నడిపి గ్రామస్తులను ఉత్సాహపరిచారు.

పెదకాకానిలో వినాయకుడి లడ్డూ రూ.1.20లక్షలు

పెదకాకాని, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని గ్రామం 3వ వాటర్ ట్యాంక్ (పాత పోలీస్ స్టేషన్ ఏరియా) దగ్గర అన్న యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దశమ గణపతి మహోత్సవంలో గణపతి లడ్డూకు నిర్వహించిన వేలంలో పెదకాకాని కాకతీయ యూత్ తరపున రూ.1లక్ష20వేలకు వేలంలో పొన్నం రాజేష్ దక్కించుకున్నాడు. కాకతీయ యూత్ ఆధ్వర్యంలో వినాయకుడి లడ్డుకు ఆదివారం వేలం నిర్వహించారు. ఈ వేలంలో కాకతీయ యూత్ అధ్యక్షుడు పొన్నం రాజేష్ లడ్డూ దక్కించుకున్నారు. కార్యక్రమంలో కాకతీయ యూత్ నాయకులు పెండ్యాల నాగసురేష్, వలివేటి మురళీకృష్ణ, యంపరాల బసవశంకర్, శ్రీకాంత్, భక్తులు పాల్గొన్నారు.


వేలంలో లడ్డూను దక్కించుకున్న పెదకాకాని కాకతీయ అధ్యక్షుడు పొన్నం రాజేష్


మామిళ్లపల్లిలో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

తెనాలి ప్రగడ కోటయ్య నగర్‌లో రూ.1.52 లక్షలు

తెనాలి అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):ప్రగడకోటయ్య నగర్‌లో వినాయక చవితి ఉత్సవాలలో నివేదించిన లడ్డూ రూ.1.52 లక్షలు పలికింది. వేలంలో కాటూరి తులసిలక్ష్మి లడ్డూ దక్కించుకున్నారు. స్వామి వారిని ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేశారు.


శలపాడు చౌదరి యూత్ ఆధ్వర్యంలో నిమజ్జనానికి తరలి వెళ్తున్న గణనాథుడు

పాడి రైతులకు బోనస్ పంపిణీ

పొన్నూరు టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంగం డెయిరీ ఆర్జించిన లాభాలు తిరిగి రైతులకు బోనస్ రూపంలో అందజేస్తున్నట్లు పాలకవర్గ సభ్యుడు బొర్రు రామారావు అన్నారు. మాచవరం పాల సొసైటీ పరిధిలో 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి 94 మంది పాడి రైతులకు ఆదివారం రూ. 2,57,809 బోనస్ డైరెక్టర్ రామారావు పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు మట్ట రంగయ్య, వేతన కార్యదర్శి ఎలవర్తి శివానందం, జోనల్ మేనేజర్ వీరేంద్రకుమార్, సూపర్‌వైజర్ బి.పాల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


బాధితులకు ఆర్థికసాయం అందజేస్తున్న నిర్వాహకులు

పొన్నూరు టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నేతాజీ నగర్‌లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదం వల్ల సర్వం కోల్పోయిన కుటుంబానికి వాసవి క్లబ్ అండగా నిలిచింది. బాధితుడు మణి కిషోర్‌కు క్లబ్ నిర్వాహకులు ఆదివారం రూ.13 వేల నగదు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు వంశీకృష్ణ, కార్యదర్శి పి.గణేష్, పి.విజయ్ కుమార్, కిషోర్, శివ రూపేష్, కె.కస్తూరి వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, సాదు పూర్ణ, మోహన్ పాల్గొన్నారు.

పారిశుధ్యానికి ప్రజలు సహకరించాలి

● డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్


కొల్లిపరలో బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ కార్మికులు

కొల్లిపర, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యానికి గ్రామీణ ప్రజలు సహకరించాలని డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్ పేర్కొన్నారు. మండలంలోని మున్నంగి, వల్లభాపురం, తూములూరు, కొల్లిపర గ్రామాల్లో ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ కార్మికులు రోడ్లను శుభ్రపర్చి బ్లీచింగ్ చల్లారు. గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. భార్గవ్ మాట్లాడుతూ గ్రామాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. బహిరంగ మల విసర్జన నేరమన్నారు.


లంక గ్రామాల నుంచి పడవ ద్వారా వస్తున్న రైతులు

కొనసాగుతున్న వరద ఉధృతి

● నదిలోకి వెళ్లవద్దని అధికారుల హెచ్చరిక

కొల్లిపర, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి 2.98 లక్షల క్యూసెక్కులకు పైగా నీటిని కృష్ణా నది దిగువకు విడుదల చేయడంతో రెండు రోజులుగా వరద ఉధృతి కొనసాగుతోంది. రేవుల్లోకి ఎవరూ వెళ్ల వద్దని తహసీల్దార్ సిద్ధార్థ హెచ్చరికలు జారీ చేశారు. మండలంలోని వల్లభాపురం, మున్నంగి, పిడపర్తిపాలెం కొల్లిపర, బొమ్మువానిపాలెం, అన్నవరం గ్రామాల్లోని రేవులను రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు సందర్శించి వరద ఉధృతిని పరిశీలించారు. పడవలు నడిపే జాలర్లు తగిన జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.


డాక్టర్ కృష్ణసందీప్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలపై అవగాహన

తెనాలి అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో తలెత్తే ఆరోగ్య సమస్యలపై డాక్టర్ అలపాటి కృష్ణ సందీప్ అవగాహన కల్పించారు. స్థానిక కవిరాజా పార్కులో ఆదివారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. వృద్ధాప్యంలో వచ్చే ఆరోగ్య సమస్యలపై డాక్టర్ కృష్ణసందీప్ తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. డాక్టర్ కృష్ణ సందీప్‌ను సన్మానించారు. అజ్గర్ ఆలీ, ఈశ్వర్‌చంద్, రామ్మూర్తి, పూర్ణచంద్రరావు, కోటిరెడ్డి, చలమయ్య, శివరామయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి

కార్యకర్తలు కృషిచేయాలి

● మంత్రి నాదెండ్ల మనోహర్


జనసేన జెండా ఆవిష్కరిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొనే సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. రూరల్ మండలం కఠెవరం బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన జనసేన జెండా దిమ్మెను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వారోత్సవాల సందర్భంగా కేక్ కట్ చేశారు. పేదలకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల కోసం జనసేన పార్టీ ఆవిర్భవించిందని అధినేత ఆశయాలకు అనుగుణంగా కార్యకర్తలు, అభిమానులు పార్టీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బండికళ్ల ప్రసాద్, రామకృష్ణ, వెంకట్, తులసి, సాంబశివరాజు తదితరులు పాల్గొన్నారు.

షుగర్ వ్యాధిగ్రస్థులకు వైద్య శిబిరం


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శారద

తెనాలి అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బుర్రిపాలెం రోడ్డులోని డాక్టర్ శారద సర్వీస్ సొసైటీలో ఆదివారం షుగర్ వ్యాధిగ్రస్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను డాక్టర్ శారద పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ప్రతినెలా చివరి వారం ఆమె ఈ సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వేకువజామునే వైద్య చికిత్సలకు వచ్చిన రోగులందరికీ అల్పాహారం కూడా అందజేశారు. బీపీ, ఈఎంఐ, రక్త పరీక్షలు నిర్వహించారు. 200మందికి పైగా రోగులకు నెలకు సరిపడా మందులు ఉచితంగా అందజేశారు. అవసరమైన రోగులకు ఈసీజీ పరీక్ష చేశారు. షుగర్ వ్యాధిగ్రస్థులు ఆహార అలవాట్లు ఖచ్చితంగా పాటించాలని, వ్యాయామం చేస్తూ జాగ్రత్తగా ఉంటే షుగర్ వ్యాధి ఏమి చేయదన్నారు. సొసైటీ వలంటీర్లు సేవలు అందించారు.



బాలికలను పరీక్షిస్తున్న వైద్యులు

బుర్రిపాలెంలో పిల్లల వైద్య శిబిరం

తెనాలి అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని బుర్రిపాలెంలో ఆదివారం పిల్లలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సినీనటుడు మహేష్‌బాబు తనయుడు గౌతమ్ పుట్టిన రోజు పురస్కరించుకుని విజయవాడ ఆంధ్ర హాస్పటల్స్ ఈ శిబిరం ఏర్పాటు చేశారు. పిల్లల వైద్య నిపుణులు శ్రీదత్తు, ముదాసీర్ పాల్గొని బాల బాలికలను పరీక్షించారు. వైరల్ ఫీవర్, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్న హాస్పటల్ ఇప్పటి వరకు 46 క్యాంపులు నిర్వహించిందని వైద్యులు చెప్పారు.

సమాజ సేవపై అవగాహన కల్పించాలి

● రోటరీ జిల్లా గవర్నర్ రాంప్రసాద్


ఇంటరాక్ట్ క్లబ్ సభ్యులతో రోటరీ ప్రతినిధులు

తెనాలి అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సమాజ సేవపై అవగాహన కల్పించాలని రోటరీ జిల్లా గవర్నర్ ఎస్వీ రాంప్రసాద్ చెప్పారు. సుల్తానాబాద్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మొక్కై వంగనిది మానై వంగుతుందా అనే సామెతను దృష్టిలో ఉంచుకుని అన్ని పాఠశాలల్లో విద్యార్థి దశలోనే సామాజిక సేవా భావాన్ని క్లబ్ పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. ప్రపంచంలో పోలియో మహమ్మారిని నిర్మూలించేందుకు రోటరీ పాత్ర ఎంతగానో ఉందన్నారు. రోటరీ క్లబ్‌తో పాటు ఇంటరాక్ట్ క్లబ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. ఐతానగర్‌లో అపర కర్మశాల గదుల నిర్మాణాన్ని పరిశీలించి రూ.2.50 లక్షల విరాళం అందజేశారు. నాజరుపేట ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రానికి వంట గది నిర్మాణ పనులను క్లబ్ సభ్యులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఈదర వెంకటపూర్ణచంద్, నల్లూరి వెంకటేశ్వరరావు, జీవీ నారాయణ, హరిప్రసాద్, వెంకటరత్నం పాల్గొన్నారు.

క్వాంటం పింఛన్‌ను పునరుద్ధరించాలి

● ఇంటర్ పెన్షనర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వైఎస్‌సీబోసు

తెనాలి అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): 70 ఏళ్లు నిండిన పెన్షనర్లకు అదనపు క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను పునరుద్ధరించాలని ఇంటర్ పెన్షనర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వైఎస్‌సీ బోసు కోరారు. సంఘ సమావేశం ఆదివారం విశ్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. పెన్షనర్ల పెండింగ్ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని తీర్మానం చేశారు. డీఆర్, పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని, 12వ పీఆర్‌సీ ఏర్పాటు చేయాలని, వైద్య సౌకర్యాలు మెరుగుపరచాలని, ఎయిడెడ్ సిబ్బందికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని, రైల్ రాయితీ పునరుద్ధరించాలని కోరారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా బోసు, కార్యదర్శిగా నాగేశ్వరరావు, గౌరవాధ్యక్షుడిగా సాంబిరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా శాస్త్రి, ఉపాధ్యక్షుడిగా ఇక్బాల్‌అహ్మద్, గోపాలరావు, కోశాధికారిగా శివకుమార్, సంయుక్త కార్యదర్శులుగా సత్యనారాయణ, పాల్‌ప్రసాద్, సభ్యులుగా మురళి, సాంబశివరావు, ప్రసాద్, కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి నారాయణరావు పర్యవేక్షించారు.


సమావేశంలో పాల్గొన్న సంఘ సభ్యులు